




# నేటి దిక్సూచి

www.netidiksuchi.com

తెలుగు దినపత్రిక

TGTEL/25/A3190








ప్రచురణ. రంగారెడ్డి, సంపుటి:01 సంచిక :181 ఎడిటర్ పి. అలివేలు పేజీలు : 04, వెల. 2రూ/ శుక్రవారం- 31 - జూలై- 2026


## పెద్దపులి సంచారం.. ఏజెన్సీ ప్రాంతంలో హై అలర్ట్



తూర్పు గోదావరి జిల్లాలో పెద్దపులి సంచారం తీవ్ర కలకలం రేపింది.

దీంతో ఏజెన్సీ ప్రాంతంలో హై అలర్ట్ ప్రకటించారు.

పెద్దపులి తూర్పు గోదావరి నుంచి ఏలూరు జిల్లా ఏజెన్సీ ప్రాంతానికి చేరుకోవడంతో అటవీ శాఖ అధికారులు అప్రమత్తమయ్యారు..

తూర్పు గోదావరి, జులై 30: జిల్లాలో పెద్దపులి సంచారం తీవ్ర కలకలం రేపింది. దీంతో ఏజెన్సీ ప్రాంతంలో అటవీశాఖ అధికారులు హై అలర్ట్ ప్రకటించారు. పెద్దపులి తూర్పు గోదావరి నుంచి ఏలూరు జిల్లా ఏజెన్సీ ప్రాంతానికి చేరుకోవడంతో అటవీ శాఖ అధికారులు అప్రమత్తమయ్యారు. గోపాలపురం మండలం నుంచి కొయ్యలగూడెం మండలం పరిధిలోని మంగపతిదేవిపేట, మెత్తప్పగూడెం అటవీ ప్రాంతాల్లో పులి సంచరిస్తున్నట్లు అధికారులు గుర్తించారు. మిగతా..2లో

## రెండు రోజులుగా వర్షాలు.. అధికారులు అందరూ ఫీల్డ్‌లో ఉండాల్సిందే



తెలంగాణలో రెండు రోజులుగా విస్తారంగా కురుస్తున్న వర్షాల నేపథ్యంలో ఆర్ అండ్ బీ అధికారులతో మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి సమీక్షా సమావేశం నిర్వహించారు.

హైదరాబాద్, జులై 30: తెలంగాణలో రెండు రోజులుగా విస్తారంగా కురుస్తున్న వర్షాల నేపథ్యంలో ఆర్ అండ్ బీ అధికారులతో మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఉమ్మడి జిల్లాలు, ఆర్ అండ్ బీ డివిజన్ల వారీగా రోడ్లు, బ్రిడ్జిలు, లో కాజ్‌వేలు, కల్వర్టుల వివరాలపై ఆరా తీశారు. ముంపు ప్రాంతాల్లో రాకపోకలకు ఇబ్బందులు లేకుండా మిగతా..2లో

## తెలంగాణలో భారీ వర్షాలు.. ఆ జిల్లాలకు రెడ్ అలర్ట్



- తీవ్ర వాయుగుండం నేపథ్యంలో నేడు రాష్ట్రంలో భారీ వర్షాలు కురుస్తాయని హైదరాబాద్‌లోని వాతావరణ కేంద్రం గురువారం వెల్లడించింది.
- ఉమ్మడి ఆదిలాబాద్‌తోపాటు జగిత్యాల జిల్లాకు రెడ్ అలర్ట్ జారీ చేసింది.
- ఈ రెండు జిల్లాల్లో అతి భారీ వర్షం కురిసే అవకాశం ఉందని పేర్కొంది.

హైదరాబాద్, జులై 30: తీవ్ర వాయుగుండం నేపథ్యంలో నేడు రాష్ట్రంలో భారీ వర్షాలు కురుస్తాయని

## 2034 వరకు నేనే సీఎం'.. ఉపాధ్యాయులకు
# సీఎం రేవంత్ కీలక హామీ

- విద్యార్థుల కోసం పోరాడాలని పిలుపు
- 55 రోజుల్లో 11 వేల మంది టీచర్లను నియమించామని వ్యాఖ్య
- ఆర్నెల్లకోసారి ఉపాధ్యాయ సంఘాలతో సమావేశం
- ప్రతి నెల ఒకటో తేదీన జీతాల హామీ

### టీచర్ల సమస్యలు తన బాధ్యతన్న సీఎం




అమరావతి: విద్యాశాఖలో సంస్కరణలు చేపడుతున్న ప్రతిసారీ కొందరు ఉపాధ్యాయ సంఘాల నాయకులు తనపై విమర్శలు చేస్తున్నారని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. అయితే వారి సమస్యలను పరిష్కరించే బాధ్యత పూర్తిగా తనదేనని స్పష్టం చేశారు. ఇకపై ఉపాధ్యాయ సంఘాలు తమ వ్యక్తిగత సమస్యల కోసం కాకుండా విద్యార్థుల భవిష్యత్తు కోసం ప్రభుత్వాన్ని ప్రశ్నించాలని పిలుపునిచ్చారు. ఫిన్‌లాండ్, జర్మనీ పర్యటన ముగించుకుని వచ్చిన ఉపాధ్యాయుల బృందంతో ఎంసీఆర్‌హెచ్‌ఆర్‌డీలో మిగతా..2లో

## మహిళా, శిశు సంక్షేమ శాఖపై సీతక్క సమీక్ష.. కీలక నిర్ణయాలు



- అంగన్వాడీ వ్యవస్థను మరింత బలోపేతం చేయడమే లక్ష్యంగా తెలంగాణ ప్రభుత్వం చర్యలు చేపడుతోంది.
- మహిళా, శిశు సంక్షేమ శాఖపై సచివాలయంలో సమీక్ష నిర్వహించిన మంత్రి సీతక్క..
- అంగన్వాడీ కేంద్రాల్లో మౌలిక వసతుల కల్పన, సిబ్బంది నియామకాలు, పిల్లల పోషణపై అధికారులకు కీలక ఆదేశాలు జారీ చేశారు.

హైదరాబాద్, జులై 30: అంగన్వాడీ వ్యవస్థను మరింత బలోపేతం చేయడమే లక్ష్యంగా తెలంగాణ ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. సచివాలయంలో మహిళా, శిశు సంక్షేమ శాఖపై మంత్రి సీతక్క సమీక్ష నిర్వహించారు. అంగన్వాడీ కేంద్రాలను మిగతా..2లో

## రాజ్యసభ ముందుకు యాంటీ పేపర్ లీక్ బిల్లు- అధికార, ప్రతిపక్షాల మధ్య మాటల యుద్ధం



- రాజ్యసభలో యాంటీ పేపర్ లీక్ బిల్లును ప్రవేశపెట్టిన కేంద్ర సహాయ మంత్రి జితేంద్ర సింగ్- ఏడుగంటల పాటు చర్చకు సమయం

ఢిల్లీ : లోక్ సభలో ఆమోదం పొందిన యాంటీ పేపర్ లీక్ చట్ట సవరణ బిల్లు గురువారం రాజ్యసభ ముందుకు వచ్చింది. కేంద్ర సహాయ మంత్రి జితేంద్ర సింగ్ ప్రవేశపెట్టారు. దీనిపై ఏడు గంటల పాటు చర్చించాలని నిర్ణయించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే మాట్లాడుతూ, పేపర్ లీకేజీ వల్ల నష్టపోయేది విద్యార్థులే అంటూ కీలక వ్యాఖ్యలు చేశారు.

## వందేమాతరం బిల్లుకు
# లోక్ సభ ఆమోదం

- వందేమాతరం అవమానాన్ని నేరంగా పరిగణించే బిల్లుకు లోక్‌సభ ఆమోదం
- జాతీయ గీతంతో సమానంగా వందేమాతరానికి చట్టపరమైన రక్షణ
- అవమానిస్తే మూడేళ్ల జైలు, జరిమానా విధించేలా కఠిన నిబంధనలు
- ఉభయ సభల ఆమోదంతో రాష్ట్రపతి పరిశీలనకు చేరనున్న



ఢిల్లీ : జాతీయ గేయం వందేమాతరాన్ని అవమానించడం లేదా దాని గానానికి ఆటంకం కలిగించడాన్ని నేరంగా పరిగణించే కీలక బిల్లుకు లోక్‌సభ గురువారం ఆమోదం ముద్ర వేసింది. జాతీయ గౌరవ పరిరక్షణ (సవరణ) బిల్లు, 2026ను ప్రతిపక్షాల నిరసనల మధ్య సభ మూజువాణి ఓటుతో ఆమోదించింది. అంతకుముందు, జూలై 29న ఈ బిల్లు రాజ్యసభలోనూ ఆమోదం పొందింది. 1971 నాటి జాతీయ గౌరవ పరిరక్షణ చట్టానికి ఈ బిల్లు సవరణలు చేపడుతుంది. ఇప్పటివరకు జాతీయ జెండా, రాజ్యాంగం, మిగతా..2లో

## ఇరాన్‌కు పాకిస్థాన్ మీదుగా చైనా క్షిపణులు..
# స్పందించిన అమెరికా అధ్యక్షుడు ట్రంప్

- కొన్ని ఆయుధాలను చైనా నుంచి ఇరాన్ కు సరఫరా చేసేందుకు రంగం సిద్ధమవుతోంది.
- చైనా నుంచి దాదాపు 60 మిలియన్ డాలర్లకుపైగా విలువైన 400 షోల్డర్‌ఫైర్డ్ ఎయిర్ డిఫెన్స్ వ్యవస్థల కొనుగోలుకు ఒప్పందం కుదిరింది.



ఢిల్లీ : అగ్రరాజ్యం అమెరికా విమానాలు హెలికాప్టర్ల కు తలనొప్పిగా మారుతున్న కొన్ని ఆయుధాలను చైనా నుంచి ఇరాన్ కు సరఫరా చేసేందుకు రంగం సిద్ధమవుతోంది. టి రవాణాకు పాకిస్థాన్ ను మార్గంగా ఎంచుకున్నట్లు అంతర్జాతీయ వార్తా సంస్థ సంచలన కథనం ప్రచురించింది. దాంతో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ స్పందించారు. పాకిస్థాన్ పేరు ఎత్తకుండా చైనాపై అసంతృప్తి వ్యక్తంచేశారు. చైనా నుంచి దాదాపు 60 మిలియన్ డాలర్లకుపైగా విలువైన 400 షోల్డర్‌ఫైర్డ్ ఎయిర్ డిఫెన్స్ వ్యవస్థల కొనుగోలుకు ఒప్పందం కుదిరింది. వాటితో తమ గగనతల రక్షణ వ్యవస్థను మరింత బలోపేతం చేసుకోవాలని ఇరాన్ భావిస్తోంది. అయితే ఈ డీల్‌కు మిగతా..2లో

## పాదయాత్రను వాయిదా వేస్తున్నా



- తన నివాసంపై దాడి చేసిన వారిపై పోలీసులు చర్యలు తీసుకోలేదని అంబటి ఆగ్రహం
- వినతి యాత్ర పేరుతో గుంటూరు నుంచి డీజీపీ కార్యాలయం వరకు పాద్రయాత్ర చేయాలని నిర్ణయం
- అదే సమయంలో వైసీపీ నిరసన కార్యక్రమాలు ఉండటంతో పాదయాత్ర వాయిదా

అమరావతి: తన నివాసంపై జరిగిన దాడికి సంబంధించి నిందితులపై పోలీసులు చర్యలు తీసుకోవడం

## ఆ కసితోనే జిల్లాలను
# అభివృద్ధి చేస్తున్నాం

- రాష్ట్ర విభజన సమయంలో రాజధాని ఎక్కడో చెప్పకుండా మనల్ని గెంటి వేశారని ఆంధ్రప్రదేశ్ ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ అన్నారు.
- ఆ కసితోనే రాష్ట్రంలో అన్ని జిల్లాలను అభివృద్ధి చేస్తున్నామని పేర్కొన్నారు.



కర్నూలు, జులై 30: రాష్ట్ర విభజన సమయంలో రాజధాని ఎక్కడో చెప్పకుండా మనల్ని గెంటేశారని ఆంధ్రప్రదేశ్ ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ అన్నారు. ఆ కసితోనే రాష్ట్రంలో అన్ని జిల్లాలను అభివృద్ధి చేస్తున్నామని పేర్కొన్నారు. రాష్ట్రంలో యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించడం కోసం కృషి చేస్తున్నామని చెప్పారు. గురువారం కర్నూలులో మంత్రి నారా లోకేశ్ మాట్లాడుతూ.. మిగతా..2లో

## సీదిరి అప్పలరాజును జగన్ పరామర్శించడంపై మంత్రుల ఆగ్రహం



- క్రిమినల్ మైండ్‌సెట్ ఉన్న వ్యక్తులు ఎలా ఉంటారో చెప్పేందుకు జగనే నిదర్శనమన్న కొల్లు రవీంద్ర
- నేరస్తులకు జగన్ వంతపాడుతున్నారని మండిపాటు

అమరావతి : వైసీపీ నేత, మాజీ మంత్రి సీదిరి అప్పలరాజు కుమారుడు ఆరవ్ వర్మ చేసిన బైక్ యాక్సిడెంట్‌లో దానయ్య అనే గొర్రెల కాపరి మృతి చెందిన కేసులో అరెస్టయిన అప్పలరాజును వైసీపీ అధినేత జగన్ పరామర్శించడంపై ఏపీ మంత్రులు తీవ్రంగా విరుచుకుపడ్డారు. ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన మిగతా..2లో

## మొదటి పేజి తరువాయి

## ఆ కసితోనే జిల్లాలను అభివృద్ధి చేస్తున్నాం

ఏపీకి పరిశ్రమలు వస్తున్నాయని అంటే అందులో ఆ శాఖ మంత్రి టీజీ భరత్ కృషి ఎంతో ఉందని తెలిపారు. ఓ పట్టుదలతో తామంతా పనిచేస్తున్నామని అన్నారు. రిలయన్స్, ఫార్మాతోపాటు ఇతర పరిశ్రమలు కర్నూలు జిల్లాకు వస్తున్నాయని ఆయన వివరించారు. పట్టుదలతోపాటు క్రమశిక్షణతో పనిచేయాలని ఈ సందర్భంగా యువతకు మంత్రి నారా లోకేశ్ పిలుపునిచ్చారు. కర్నూలులో హైకోర్టు బెంచ్ మూడు నెలల్లో (90 రోజుల్లో) వస్తుందని ప్రకటించారు. ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించడం కోసం ప్రభుత్వం పనిచేస్తుందని చెప్పారు. గతంలో తాను చేపట్టిన యువగళం పాదయాత్రలో తనను పత్తికొండలో పోలీసుల ద్వారా అడ్డుకునే ప్రయత్నం చేశారని.. కానీ ప్రజలు, కార్యకర్తలు అండగా నిలిచారని గుర్తు చేసుకున్నారు. యువగళంలో ఇచ్చిన మాట ప్రకారం.. 20 లక్షల ఉద్యోగాలు ఇవ్వాలని భారీగా పరిశ్రమలు తీసుకొస్తున్నామని మంత్రి నారా లోకేశ్ పేర్కొన్నారు. సోలార్ ప్రాజెక్టులు వస్తుంటే రైతులను రెచ్చగొట్టే ప్రయత్నాలు చేస్తున్నారని వైసీపీ నేతల తీరుపై మండిపడ్డారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక యూనిట్‌పై రూ.13 పైసలు తగ్గించామన్నారు. విద్యుత్ ఉత్పత్తిలో ఆంధ్రప్రదేశ్‌ను మొదటి స్థానంలో ఉంచాలనే లక్ష్యంతో పని చేస్తున్నామని మంత్రి నారా లోకేశ్ చెప్పారు.

## పెద్దపులి సంచారం.. ఏజెన్సీ ప్రాంతంలో హై అలర్ట్

రేడియో కాలర్ సిగ్నల్స్ ఆధారంగా పులి కదలికలను నిరంతరం పర్యవేక్షిస్తున్న అధికారులు, దాని జాడ కోసం ప్రత్యేక బృందాలతో అటవీ ప్రాంతంలో గాలింపు చర్యలు చేపట్టారు. రేడియో కాలర్ సిగ్నల్ ప్రకారం.. పులి కేవలం 100 మీటర్ల పరిధిలోనే ఉన్నట్లు గుర్తించినప్పటికీ, ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షం కారణంగా అంతరాయం ఏర్పడినట్లు తెలుస్తోంది. వర్షం తగ్గిన వెంటనే పులి సంచారాన్ని మరింత స్పష్టంగా ట్రాక్ చేసేందుకు అధికారులు చర్యలు చేపడుతున్నారు. పులి సంచారం నేపథ్యంలో ఏజెన్సీ పరిసర గ్రామాల ప్రజలను అటవీ శాఖ అప్రమత్తం చేసింది. ప్రజలు ఒంటరిగా అటవీ ప్రాంతాల్లోకి వెళ్లవద్దని, ముఖ్యంగా రాత్రి వేళల్లో మరింత జాగ్రత్తగా ఉండాలని సూచించారు. పొలాల్లో ఉన్న పశువులను వెంటనే సురక్షిత ప్రాంతాలకు తరలించాలని, పులి కనిపించినా లేదా దాని అడుగుజాడలు గుర్తించినా వెంటనే అధికారులకు సమాచారం అందించాలని కోరారు.

## పాదయాత్రను వాయిదా వేస్తున్నా: అంబటి రాంబాబు

లేదని ఆరోపిస్తూ తలపెట్టిన 'వినతి యాత్ర' పాదయాత్రను మాజీ మంత్రి, వైసీపీ నేత అంబటి రాంబాబు తాత్కాలికంగా వాయిదా వేశారు. గుంటూరులోని తన నివాసంలో పార్టీ నేతలతో అత్యవసరంగా సమావేశమైన అనంతరం ఆయన ఈ నిర్ణయాన్ని వెల్లడించారు. త్వరలోనే పాదయాత్రకు సంబంధించి కొత్త తేదీని ప్రకటిస్తానని తెలిపారు. గతంలో ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం... ఆగస్టు 7, 8 తేదీల్లో గుంటూరులోని తన నివాసం నుంచి మంగళగిరిలోని డీజీపీ కార్యాలయం వరకు రెండు రోజుల పాటు ఈ నిరసన పాదయాత్ర చేపట్టాల్సి ఉంది. అయితే, రాష్ట్రంలో డీఎస్సీ నిర్వహణలో జరిగినట్లు ఆరోపిస్తున్న అక్రమాలపై వైసీపీ అదే సమయంలో రాష్ట్రవ్యాప్త నిరసన కార్యక్రమాలకు పిలుపునిచ్చింది. పార్టీ అధిష్ఠానం చేపడుతున్న ముఖ్యమైన నిరసన కార్యక్రమాలకు ప్రాధాన్యతనిస్తూ, తన సొంత పాదయాత్రను వాయిదా వేస్తున్నట్లు అంబటి స్పష్టం చేశారు.

## మహిళా, శిశు సంక్షేమ శాఖపై సీతక్క సమీక్ష..

మరింత బలోపేతం చేసేందుకు జిల్లాల వారీగా అంగన్వాడీ టీచర్లు, ఆయాలతో సదస్సులు నిర్వహించి వారి సూచనలు స్వీకరించాలని అధికారులను ఆదేశించారు. అంగన్వాడీ కేంద్రాల్లో టాయిలెట్లు, తాగునీరు, విద్యుత్ వంటి మౌలిక వసతుల సమస్యలను గుర్తించి వెంటనే పరిష్కరించాలని సూచించారు. అలాగే అంగన్వాడీ టీచర్లు, ఆయాల యూనిఫార్మ్‌లను అక్టోబర్ మొదటి వారంలోగా సిద్ధం చేయాలని స్పష్టం చేశారు. రాష్ట్రంలోని ప్రతి జిల్లాలో అడాప్షన్ సెంటర్లు ఏర్పాటు చేసే దిశగా చర్యలు వేగవంతం చేయాలని మంత్రి సీతక్క సూచించారు. ప్రస్తుతం రాష్ట్రంలో 17 అడాప్షన్ సెంటర్లు ఉన్నాయని అధికారులు మంత్రికి వివరించారు. అంగన్వాడీ టీచర్లు, ఆయాల నియామక ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని, ఇప్పటికే 16 జిల్లాల్లో నోటిఫికేషన్లు జారీ కాగా మిగిలిన జిల్లాల్లో కలెక్టర్లతో సమన్వయం చేసుకోవాలని ఆదేశించారు. అంగన్వాడీ కేంద్రాల్లో పిల్లల పోషకాహారం, ఎదుగుదలపై శాంపిల్ సర్వే నిర్వహించి, దాని ఆధారంగా పోషకాహార కార్యక్రమాలను మరింత మెరుగుపరచాలని పేర్కొన్నారు. కేంద్రం నుంచి వచ్చే నిధులు లాప్స్ కాకుండా ప్రజల అవసరాలకు అనుగుణంగా ప్రతి రూపాయిని సమర్థవంతంగా వినియోగించాలని మంత్రి అధికారులకు సూచించారు.

## తెలంగాణలో భారీ వర్షాలు.. ఆ జిల్లాలకు రెడ్ అలర్ట్

హైదరాబాద్‌లోని వాతావరణ కేంద్రం గురువారం వెల్లడించింది. ఉమ్మడి ఆదిలాబాద్‌తోపాటు జగిత్యాల జిల్లాకు రెడ్ అలర్ట్ జారీ చేసింది. ఈ రెండు జిల్లాల్లో అతి భారీ వర్షం కురిసే అవకాశం ఉందని పేర్కొంది. ఉమ్మడి నిజామాబాద్‌తోపాటు రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, ములుగు జిల్లాల్లో అతి భారీ వర్షం కురిసే అవకాశం ఉందని తెలిపింది. దీంతో ఈ జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ ప్రకటించింది. ఉమ్మడి రంగారెడ్డి, హైదరాబాద్, మెదక్‌తోపాటు హనుమకొండ, జనగాం, వరంగల్, మహబూబాబాద్, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో భారీ వర్షం కురిసే అవకాశం ఉందని వివరించింది. ఈ జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ చేసింది. రాష్ట్రంలోని మిగతా జిల్లాల్లో తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షం కురిసే అవకాశం ఉందని హైదరాబాద్‌లోని వాతావరణ కేంద్రం ప్రకటించింది.

## రెండు రోజులుగా వర్షాలు.. అధికారులు అందరూ ఫీల్డ్‌లో ఉండాల్సిందే

ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. కల్వర్టులు, లో కాజ్‌వేలు, కోతకు గురైన రోడ్ల వద్ద ప్రమాద హెచ్చరిక బోర్డులు పెట్టాలన్నారు. అధికారులు అందరూ ఫీల్డ్‌లో ఉండాలని ఆదేశించారు. ఇప్పటికే నిర్మాణంలో ఉన్న రోడ్లు, బ్రిడ్జిల వద్ద తగు జాగ్రత్త చర్యలు చేపట్టాలని మంత్రి సూచించారు. క్షేత్రస్థాయిలో రెవెన్యూ, పోలీస్, విద్యుత్, ఇరిగేషన్ శాఖలతో సమన్వయం చేసుకోవాలన్నారు. ప్రతి రోజు ఫీల్డ్ రిపోర్ట్ తయారు చేయాలని, క్షేత్రస్థాయి ఇంజినీర్లతో మొబైల్ ఫోన్ కాన్ఫరెన్స్ నిర్వహిస్తానని వెల్లడించారు. ఈఎన్సీ నుంచి ఏఈ వరకూ అందరు పూర్తి అలెర్ట్‌గా ఉండాలని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి ఆదేశాలు జారీ చేశారు.

## ఇరాన్‌కు పాకిస్థాన్ మీదుగా చైనా క్షిపణులు.. స్పందించిన అమెరికా అధ్యక్షుడు ట్రంప్

టెహ్రాన్ పక్షాన హాంకాంగ్ చెందిన ఝూంగ్‌కింగ్ బావోషాంగ్ ఇంటర్నేషనల్ ఇన్వెస్ట్‌మెంట్ మధ్యవర్తిగా ఉంది. ఈ క్షిపణులను ఉత్తర చైనా నుంచి పాకిస్థాన్ మీదుగా ఇరాన్‌లోకి చేర్చాలని ప్రణాళిక సిద్ధం చేశారు. కాకపోతే వీటిని భూమార్గంలో తరలిస్తారా..? గగనతలంలో తీసుకెళతారా అనే అంశంపై స్పష్టతలేదు. అయితే ఈ కథనాలను చైనా కొట్టిపారేసింది. ఈ క్రమంలోనే తాజాగా అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఈ అంశంపై స్పందించారు. చైనా ఆయుధాల సరఫరా విషయం తెలుసుకొని తాను నిరాశకు గురైనట్లు పేర్కొన్నారు. తాము ఇరాన్‌కు ఆయుధాలు విక్రయించబోమని చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్ స్వయంగా తనకు హామీ ఇచ్చినట్లు పేర్కొన్నారు. చైనా, రష్యాల నుంచి ఇరాన్‌కు ఆయుధాలు సరఫరా చేయవద్దని గత వారం ట్రంప్ హెచ్చరికలు కూడా చేశారు.

## వందేమాతరం బిల్లుకు లోక్ సభ ఆమోదం



జాతీయ గీతం 'జన గణ మన'కు మాత్రమే ఉన్న చట్టపరమైన రక్షణ ఇకపై వందేమాతరం గేయానికి కూడా వర్తించనుంది. నూతన నిబంధనల ప్రకారం, ఎవరైనా ఉద్దేశపూర్వకంగా వందేమాతరం గానానికి ఆటంకం కలిగించినా లేదా దానిని అవమానించినా గరిష్ఠంగా మూడేళ్ల జైలు శిక్ష, జరిమానా లేదా రెండూ విధించే అవకాశం ఉంటుంది. కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి నిత్యానంద రాయ్ ఈ బిల్లును సభలో ప్రవేశపెట్టారు. జాతీయ గీతంతో సమానంగా వందేమాతరానికి సమున్నత గౌరవం కల్పించడమే ఈ చట్టం ప్రధాన ఉద్దేశమని ఆయన ఈ సందర్భంగా వివరించారు. సభలో చర్చ కొనసాగుతున్న సమయంలో ప్రతిపక్ష సభ్యులు ఇతర అంశాలపై పట్టుబడుతూ నిరసనలు వ్యక్తం చేయగా, వారు ప్రతిపాదించిన సవరణలను సభ తోసిపుచ్చింది. వందేమాతరం 150వ వార్షికోత్సవాల నేపథ్యంలో ఈ బిల్లును తీసుకురావడం ప్రాధాన్యత సంతరించుకుంది.

# సీదిరి అప్పలరాజును జగన్ పరామర్శించడంపై మంత్రుల ఆగ్రహం

### మొదటి పేజి తరువాయి



బాధితుడి కుటుంబాన్ని వదిలేసి, నిందితులను జగన్ పరామర్శించడం దారుణమని మంత్రులు కొల్లు రవీంద్ర, సంధ్యారాణి మండిపడ్డారు. మంత్రి కొల్లు రవీంద్ర మాట్లాడుతూ... "క్రిమినల్ మైండ్‌సెట్ ఉన్న వ్యక్తులు ఎలా ఉంటారో చెప్పేందుకు జగనే ప్రత్యక్ష నిదర్శనం. గతంలో అనేక ప్రమాదాల్లో బాధితులను పట్టించుకోని జగన్.. ఇప్పుడు హంతకులకు, రౌడీలకు నేరుగా క్లీన్ చిట్ ఇస్తూ నేరస్తులకు వంతపాడుతున్నారు. ఇలాంటి వ్యక్తుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి" అని పిలుపునిచ్చారు. మంత్రి సంధ్యారాణి స్పందిస్తూ... జగన్ వస్తున్నారంటే చనిపోయిన గొర్రెల కాపరి కుటుంబాన్ని పరామర్శిస్తారేమో అని ఆశపడితే సీన్ రివర్స్ అయిందన్నారు. బాధితులను కాకుండా చంపిన వారిని పరామర్శించడమే ఆ పార్టీ నేర ప్రవృత్తికి నిదర్శనమని విమర్శించారు. ఇప్పటికైనా జగన్ తన వైఖరి మార్చుకోకపోతే వచ్చే ఎన్నికల్లో సింగిల్ డిజిట్‌కే పరిమితం కావడం ఖాయమని వ్యాఖ్యానించారు. మరోవైపు, పలాసలో జగన్ పర్యటన సందర్భంగా హైవేపైకి వైసీపీ కార్యకర్తలు భారీగా తరలివచ్చారు. ముందస్తు అనుమతులు లేకపోవడంతో జామి, డెంకాడ ప్రాంతాల వద్ద కార్యకర్తలను పోలీసులు అడ్డుకున్నారు. దీంతో పోలీసుల తీరును నిరసిస్తూ కార్యకర్తలు రోడ్డుపైనే బైఠాయించి నిరసనకు దిగడంతో జాతీయ రహదారిపై వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది.

# 2034 వరకు నేనే సీఎం'.. ఉపాధ్యాయులకు సీఎం రేవంత్ కీలక హామీ

### మొదటి పేజి తరువాయి

జరిగిన సమావేశంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. ఉపాధ్యాయ సంఘాల నాయకులకు తాను ఒక్కటే చెబుతున్నానని రేవంత్ అన్నారు. "మీ సమస్యలు నాకు వదిలేయండి. మీరు అడగకముందే వాటిని పరిష్కరిస్తాను. ప్రమోషన్లు, బదిలీలు కూడా మీ ఇంటి వద్దకే పంపించాం. ఇకపై మీకోసం కాదు.. విద్యార్థుల సమస్యల కోసం నాతో కొట్లాడండి" అని సూచించారు. విద్యా వ్యవస్థను మరింత బలోపేతం చేయడంలో ఉపాధ్యాయులు కీలక పాత్ర పోషించాలని కోరారు. 2034 వరకు తానే ముఖ్యమంత్రిగా ఉంటానని వ్యాఖ్యానించిన రేవంత్ రెడ్డి, ఆ లోపు ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి పూర్తి బాధ్యత వహిస్తానన్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా కేవలం 55 రోజుల్లో 11 వేల మంది ఉపాధ్యాయులను నియమించామని గుర్తు చేశారు. ఇలాంటి నియామకాలు గతంలో ఎప్పుడైనా జరిగాయా అని ప్రశ్నించారు. ఈ ప్రభుత్వం ఉపాధ్యాయులదేనని, అందుకే వారి సంక్షేమానికి ప్రాధాన్యం ఇస్తోందని చెప్పారు. రాబోయే ఐదేళ్లలో తెలంగాణ విద్యాశాఖను ప్రపంచ దేశాలు ఆదర్శంగా చూసే స్థాయికి తీసుకెళ్లాలని రేవంత్ పిలుపునిచ్చారు. పంచవర్ష ప్రణాళిక తరహాలో ఉపాధ్యాయ సంఘాలు ప్రతిజ్ఞ చేసి పని చేయాలని కోరారు. అలాంటి కృషి చేస్తే విద్యారంగంలో విప్లవాత్మక మార్పులు వస్తాయని అన్నారు. దేశానికి విద్య, వైద్య రంగాల్లో తెలంగాణే నాయకత్వం ఎందుకు ఇవ్వకూడదని ప్రశ్నించారు. ఇకపై ప్రతి ఆరు నెలలకు ఒకసారి ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి ఉపాధ్యాయ సంఘాల నాయకులతో నేరుగా చర్చిస్తానని సీఎం హామీ ఇచ్చారు. వారి సమస్యల పరిష్కారానికి క్రమం తప్పకుండా చర్యలు తీసుకుంటామని చెప్పారు. గతంలో ఒకటో తేదీన ఉద్యోగుల జీతాలు సమయానికి పడేవి కాదని, ఇప్పుడు మాత్రం అడగకుండానే ప్రతి నెల




ఒకటో తారీఖున జీతాలు జమ చేస్తున్నామని తెలిపారు. ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు కూడా అదే రోజు వేతనాలు చెల్లిస్తున్నామని వెల్లడించారు.

# యువతకు, ప్రభుత్వానికి మధ్య నమ్మకమే కీలకం- కేంద్రం ఆ హామీలను నిలబెట్టుకుంటే సంతోషం

వందే భారత్ ప్రయాణాన్ని ప్రశంసించిన సోనమ్ వాంగ్‌చుక్- విద్యార్థులపై ఎఫ్ఐఆర్‌లు పెట్టొద్దంటూ కేంద్రానికి విజ్ఞప్తి- కేంద్ర హోంమంత్రి అమిత్ షా రాజీనామా చేయాలని సీజేపీ ఫౌండర్ అభిజీత్ దిప్కే డిమాండ్

ఢిల్లీ : నీట్- యూజీ ప్రశ్నాపత్రం లీక్ అంశంపై ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద జరిగిన విద్యార్థుల ఉద్యమం సందర్భంగా ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని పర్యావరణ కార్యకర్త సోనమ్ వాంగ్‌చుక్ కోరారు. ముఖ్యంగా ఉద్యమంలో పాల్గొన్న విద్యార్థులపై ఎలాంటి ఎఫ్ఐఆర్‌లు నమోదు చేయబోమని ఇచ్చిన హామీని తప్పకుండా నిలబెట్టుకోవాలని అన్నారు. ఈ మేరకు ఎక్స్‌లో ఓ వీడియో పోస్టు చేశారు. 'భారతీయ రైల్వేపై నాకు ఎంతో గర్వంగా ఉంది. ఇప్పుడు కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలను కూడా అదే స్థాయిలో నిలబెట్టుకుంటే మరింత సంతోషిస్తాను' అంటూ వాంగ్‌చుక్ వ్యాఖ్యానించారు. ఢిల్లీ నుంచి లద్దాఖ్ తిరుగు ప్రయాణంలో వందే భారత్ ఎక్స్‌ప్రెస్‌లో ప్రయాణించిన ఆయన, తన అనుభవాన్ని పంచుకున్నారు. లద్దాఖ్ కు వెళ్లే మార్గంలో ఢిల్లీ- శ్రీనగర్ వందే భారత్‌లో ప్రయాణించిన వాంగ్‌చుక్, చినాబ్ రైల్వే వంతెనపై ప్రయాణం అద్భుతంగా ఉందని పేర్కొన్నారు. "రైలు ప్రయాణం నాకు ఎప్పటినుంచో ఇష్టమైనది. ఆ ప్రయాణం చాలా ఆహ్లాదకరంగా అనిపించింది. భారతీయ రైల్వే సాధించిన అభివృద్ధి నిజంగా ప్రశంసనీయం" అని ఆయన వీడియో సందేశంలో తెలిపారు. "యువతతో నమ్మకమైన సంబంధాన్ని ఏర్పరచుకోవడం ఏ ప్రభుత్వానికైనా చాలా ముఖ్యం. విద్యార్థులపై ఎలాంటి చట్టపరమైన చర్యలు తీసుకోబోమని ప్రభుత్వం లిఖితపూర్వకంగా హామీ ఇచ్చింది. ఆ మాటను నిలబెట్టుకోవాలి. దేశ భవిష్యత్తు యువత చేతుల్లోనే ఉంది"

**సోనమ్ వాంగ్ చుక్**

కాగా, పార్లమెంట్‌లో ప్రజా పరీక్షల సవరణ బిల్లును ప్రవేశపెట్టడాన్ని ఆయన స్వాగతించారు. ఈ బిల్లు కేవలం పరీక్షల



వ్యవస్థలోనే కాకుండా దేశ విద్యా వ్యవస్థలోనూ సమగ్ర మార్పులకు దారితీయాలని ఆకాంక్షించారు. గత నెలలో నీట్ పరీక్షల్లో జరిగిన అవకతవకలకు నిరసనగా కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) ఆధ్వర్యంలో విద్యార్థులు చేపట్టిన 36 రోజుల ఉద్యమానికి సోనం వాంగ్‌చుక్ మద్దతు తెలిపారు. జూన్ 28 నుంచి ఆయన నిరాహార దీక్ష చేపట్టగా, ఆరోగ్యం క్షీణించడంతో ఆసుపత్రికి తరలించారు. అనంతరం కేంద్రం ప్రధాన డిమాండ్లను అంగీకరించడంతో ఆయన తన దీక్షను విరమించారు.

### అమిత్ షా రాజీనామాకు దీప్కే డిమాండ్

అదే సమయంలో సీజేపీ ఫౌండర్ అభిజీత్ దీప్కే మరోసారి కేంద్ర ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు గుప్పించారు. జూలై 20న నిర్వహించిన సంసద్ చలో కార్యక్రమం సందర్భంగా విద్యార్థులపై పోలీసులు బలప్రయోగం చేశారని ఆరోపించారు. దీనిపై కేంద్ర హోంమంత్రి అమిత్ షా బాధ్యత వహించి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. "విద్యార్థులపై బలప్రయోగానికి ఆదేశాలు అమిత్ షా నుంచే వచ్చి ఉండాలి. ప్రజాస్వామ్యాన్ని కాపాడటం ఇప్పుడు కేవలం ప్రతిపక్షాల బాధ్యత మాత్రమే కాదు. దేశ ప్రజలందరూ కలిసి రావాల్సిన అవసరం ఉంది" అని మహారాష్ట్రలోని ఛత్రపతి సంభాజీనగర్‌లో మీడియాతో మాట్లాడుతూ దీప్కే అన్నారు. దేశంలో ప్రజాస్వామ్యం ప్రమాదంలో ఉందని, దర్యాప్తు సంస్థలను రాజకీయ ప్రయోజనాల కోసం వినియోగిస్తున్నారంటూ ఆయన ఆరోపించారు. అలాగే కొత్త విద్యాశాఖ మంత్రిగా బాధ్యతలు స్వీకరించిన ప్రహ్లాద్ జోషిపై కూడా విమర్శలు చేశారు. యోగ గురువు బాబా రామ్‌దేవ్ చేసిన వ్యాఖ్యలపైనా దీప్కే స్పందించారు. జంతర్‌మంతర్ ఉద్యమం భారతీయ సంస్కృతిని దెబ్బతీసిందన్న రామ్‌దేవ్ వ్యాఖ్యలను ఆయన ఖండించారు. "మహాత్మా గాంధీ, బీఆర్ అంబేద్కర్ చిత్రాలతో రాజ్యాంగబద్ధంగా ఉద్యమించడం సంస్కృతిని అవమానించడం ఎలా అవుతుంది? యువత దేశాన్ని, సంస్కృతిని చక్కగా ముందుకు తీసుకెళ్లగలదు" అని ఆయన వ్యాఖ్యానించారు. అంతేకాకుండా, ఢిల్లీ పోలీసులు నిరసనల సమయంలో రాళ్లతో నిండిన ట్రక్కులను ఉద్యమ ప్రాంతానికి తీసుకొచ్చారని కూడా దీప్కే ఆరోపించారు. విద్యార్థులే రాళ్ల దాడికి పాల్పడ్డారని చూపించేందుకు ఇది ముందస్తు ప్రణాళికలో భాగమని ఆయన అన్నారు. ఈ విషయాన్ని తాను సంబంధిత డీసీపీ దృష్టికి తీసుకెళ్లినట్లు చెప్పారు. అయితే, పోలీసులు మాత్రం అవి నిర్మాణ వ్యర్థాలను తరలిస్తున్న వాహనాలని వివరణ ఇచ్చినట్లు తెలిపారు. రైతుల ఉద్యమాలకు కూడా అవసరమైతే సీజేపీ మద్దతు ఉంటుందని దీప్కే స్పష్టం చేశారు. "మాలో చాలా మంది రైతు కుటుంబాలకు చెందినవారే. రైతుల పిల్లల భవిష్యత్తు కోసం కూడా మేం నిలబడతాం" అని చెప్పారు.

### ఢిల్లీ పోలీసుల ఉత్తర్వులు

అదే సమయంలో ఢిల్లీ ప్రభుత్వం కీలక ప్రకటన చేసింది. సీజేపీ నిరసనకారులపై ఢిల్లీ పోలీసులు ఎటువంటి చట్టపరమైన చర్యలు తీసుకోరని ఉత్తర్వులు జారీ చేసింది. ఇప్పటి వరకు 13 ఎఫ్ఐఆర్‌లు నమోదయ్యాయని, అరెస్టయిన లేదా అదుపులోకి తీసుకున్న వారిని త్వరగా విడుదల చేస్తారని తెలిపింది. నేర చరిత్ర ఉన్నవారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటారని మాత్రం స్పష్టం చేసింది.

# బిహార్ స్టైల్' జెన్జ్ నిరసన- బారికేడ్ల చోరీ- పోలీసులతోనే టగ్ అఫ్ వార్



వినూత్నంగా బిహార్‌లో జెన్ జెడ్ ఆందోళనలు- చాలా ఫన్నీ ఘటనలు- పోలీసులు, విద్యార్థుల మధ్య టగ్ ఆఫ్ వార్- అణుబాంబు కావాలన్న నిరసనకారుడు

ఢిల్లీ : నీట్ పేపర్ లీకేజ్ , విద్యా వ్యవస్థలోని లోపాలను అరికట్టాలని డిమాండ్ చేస్తూ ఇటీవలే దేశ రాజధాని ఢిల్లీ జెన్ జెడ్ నిరసనలతో అట్టుడికిపోయింది. సీజేపీ, నిరుద్యోగ యువత ధర్నాలు, ఆందోళనలు, నిరసన ప్రదర్శనలతో హోరెత్తించారు. ఈ క్రమంలో నిరసనకారులపై లాఠీచార్జ్ చేయగా పలువురు గాయపడ్డారు. అలాగే చెదురుమదురు హింసాత్మక ఘటనలు సైతం జరిగాయి. అయితే బిహార్‌లో జెన్ జెడ్ చేసిన నిరసనలు సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారాయి. నిరసన ప్రదర్శనల కొన్ని వీడియో క్లిప్‌లు ఫన్నీగా ఉండడంతో నెటిజన్లకు నవ్వు తెప్పిస్తున్నాయి. ప్రశ్నాపత్రాల లీకేజీని వ్యతిరేకిస్తూ జులై 22-25 మధ్య బిహార్ యువత రోడ్డెక్కింది. పట్నా సహా రాష్ట్రంలోని ఇతర నగరాల్లో ఆందోళన చేపట్టారు. కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అయితే ఈ నిరసనల సమయంలో బిహార్ విద్యార్థులు చేసిన చేష్టలు అందరికి నవ్వు తెప్పిస్తున్నాయి. అందుకే ఈ ఆందోళనలను 'బిహార్ స్టైల్' జెన్ జెడ్ నిరసనగా పలువురు అభివర్ణిస్తున్నారు.

టియర్‌గ్యాస్ లవర్!

జులై 22న పట్నాలో నిరసనకారులపై బిహార్ పోలీసులు టియర్‌గ్యాస్ షెల్స్‌ను ప్రయోగించారు. అక్కడ ఉన్న విద్యార్థుల్లో ఒకరు టియర్‌గ్యాస్ రుచి చూశాడు. ఆ సమయంలో అతడు మాట్లాడిన వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. "అందరికీ నమస్కారం. నేను ఈరోజు ఒక తప్పు చేశాను. పోలీసులు మాపై టియర్‌గ్యాస్ ప్రయోగించారు. నేను దాని రుచి ఎప్పుడూ చూడలేదు. అందుకే ఆ పొగలోకి వెళ్లాను. అదొక చాలా శక్తివంతమైన పదార్థం మిత్రులారా. అందులో ఇథనాల్ సున్నా శాతం ఉంటుంది. చర్మం కూడా మండిపోతోంది. కళ్లు మండుతున్నాయి. నా ముక్కు నుంచి నీరు కారుతోంది" అని వీడియోలో చెప్పాడు. సారన్ జిల్లాలో యువకులు తమపై పోలీసులు ప్రయోగించిన టియర్‌గ్యాస్ షెల్స్‌ను ఏమాత్రం లెక్కచేయకుండా పట్టుకున్నారు. తిరిగి టియర్‌గ్యాస్ షెల్స్‌ను పోలీసులపైకే విసిరారు. దీంతో నిరసనకారులను ఎలా అదుపు చేయాలో పోలీసులకు అర్థంకాక సతమతమయ్యారు. ఛప్రా పట్టణం సహా ఇతర ప్రాంతాలలో ఆందోళనకారులు తమపైకి ప్రయోగించిన టియర్‌గ్యాస్ షెల్స్‌ను కర్రలతో బాదారు.

బారికేడ్ల దొంగతనం- రోలర్ స్కేట్లుగా మార్పు

తమ ప్రదర్శనను అడ్డుకోవడానికి ఏర్పాటు చేసిన బారికేడ్లను చూసి విద్యార్థులు ఆగ్రహంతో ఊగిపోయారు. తమ గళాన్ని ఎవరూ అణచివేయలేరని ప్రతీకాత్మకంగా తెలియజేసేందుకు బారికేడ్లను ఎత్తిపట్టుకుని పారిపోయారు. అంతేకాకుండా వారిలో చాలామంది బారికేడ్లను రోలర్ స్కేట్లుగా, కిక్ స్కూటర్లుగా, రైడ్-ఆన్ బొమ్మలుగా మార్చారు.

వాటర్ కెనాన్- రెయిన్ డ్యాన్స్

పేపర్ లీకేజీలకు బాధ్యత వహిస్తూ అప్పటి కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని మండుటెండలో నిరసనకారులు ఆందోళన చేశారు. అయితే తీవ్రమైన ఎండ కారణంగా తమ డిమాండ్‌ను మరిచిపోయి భద్రతా సిబ్బందిని టియర్ గ్యాస్, వాటర్ కెనాన్‌ల కోసం ఏమైనా ఏర్పాట్లు చేశారా అని ప్రశ్నించారు. అప్పుడు పోలీసు అధికారులలో ఒకరు అవునని సమాధానం ఇచ్చారు. వాటర్ కెనాన్‌లను నిరసనకారులపై పోలీసులు ప్రయోగించగా స్టూడెంట్స్ రెయిన్ డ్యాన్స్ చేయడం చర్చనీయాంశమైంది.

# రాజ్యసభ ముందుకు యాంటీ పేపర్ లీక్ బిల్లు- అధికార, ప్రతిపక్షాల మధ్య మాటల యుద్ధం

### మొదటి పేజి తరువాయి

బిల్లును ప్రవేశపెట్టిన అనంతరం జితేంద్ర సింగ్ మాట్లాడుతూ, కొత్త చట్టం ప్రకారమే నీట్ ప్రశ్నపత్రం లీక్ ఈ కేసు విచారణ జరుగుతున్నట్లు తెలిపారు. ఈ కేసు దర్యాప్తును సీబీఐకి అప్పగించినట్లు చెప్పారు. దర్యాప్తు సంస్థ ఇప్పటికే ఛార్జ్‌షీటు కూడా దాఖలు చేసినట్లు తెలిపారు. యాంటీ పేపర్ లీక్ బిల్లుపై చర్చను రాజ్యసభలో ప్రారంభించిన మంత్రి జితేంద్రసింగ్ నీట్ పేపర్ లీక్‌పై దర్యాప్తు ఐదు నెలల్లో పూర్తవుతుందని చెప్పారు. ఈ సందర్భంగా ప్రతిపక్షాలపై మంత్రి జితేంద్రసింగ్ విమర్శలు గుప్పించారు. ఆర్టికల్ 370 రద్దు, ఎన్టీఏ ఏర్పాటు ఆలస్యానికి కారణం ఎవరని ప్రతిపక్షాలను నిలదీశారు. 'ఇటీవలి కేసుకు సంబంధించి వెంటనే సీబీఐకి అప్పగించాం. మొన్న ఛార్జిషీట్ దాఖలు చేశాం. నిన్నటి నుంచి విచారణ ప్రారంభమైందని తెలియజేయడానికి సంతోషిస్తున్నాను. ఈ కొత్త చట్టం ప్రకారం దర్యాప్తు 2 నెలల్లో పూర్తవుతుంది. ఆ తర్వాత మూడునెలల్లో విచారణ జరుగుతుంది. అంటే మొత్తం 5నెలల్లో ప్రక్రియ పూర్తవుతుంది. వారి నిబద్ధతగా ఉన్న ఆర్టికల్ 370ని రద్దు చేయడానికి 70ఏళ్లు పట్టింది. నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీని తీసుకురాకుండా అడ్డుకోవడానికి 33ఏళ్లు తీసుకున్నారు. ఇప్పుడు ఈ బిల్లును తీసుకువస్తున్న తరుణంలో వారు చేస్తున్న గగ్గోలు బిల్లుకు వ్యతిరేకం కాదు. ఇకపై ప్రమాదంలో పడబోయే వారి స్వార్థ ప్రయోజనాలకు వ్యతిరేకంగా జరుగుతున్న గగ్గోలు ఇది. 33ఏళ్లపాటు వారు చేయలేని పని ఇప్పుడు నెరవేరబోతోంది' ఖర్గే తెలిపారు.

**కుర్చీపోతుందనే భయంతోనే డిమాండ్లు అంగీకరించారు : ఖర్గే**



కుర్చీపోతుందనే భయంతోనే కేంద్ర ప్రభుత్వం విద్యార్థుల డిమాండ్లకు అంగీకరించిందని రాజ్యసభలో ప్రతిపక్ష నేత మల్లికార్జున ఖర్గే విమర్శించారు. విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలన్న చిత్తశుద్ధి ప్రభుత్వానికి ఏమాత్రం లేదన్నారు. రాజ్యసభలో యాంటీ పేపర్ లీక్ చట్టసవరణ బిల్లుపై మాట్లాడిన ఖర్గే, విద్యార్థులపై పెల్లెట్ గన్ల వాడకానికి కేంద్ర హోంశాఖ మంత్రిదే బాధ్యత అని, ఇప్పుడు ఆయన దాక్కున్నారని ఎద్దేవా చేశారు. ఒకరోజు ఆయన్ను బయటకు లాగి ప్రజల ముందు నిలబెడ్తామని ఖర్గే తేల్చిచెప్పారు. "రాజ్యసభలో ప్రతిపక్ష నేత పరీక్షా వ్యవస్థలోని వైఫల్యాలకు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా యువత తమ గళాన్ని తీవ్రంగా వినిపించారు. విద్యార్థుల ఆవేదనను ప్రతిపక్షాలు వీధుల నుంచి పార్లమెంటు వరకు ప్రతిధ్వనించేలా చేశాయి. అంతకంతకూ పెరుగుతున్న ప్రజా ఒత్తిడికి తలొగ్గి, ప్రభుత్వం మోకరిల్లాల్సి వచ్చింది. పోరాటం ఫలించి, ప్రభుత్వం మెడలు వంచేలా చేసిన దేశ యువతకు, విద్యార్థులకు నా హృదయపూర్వక అభినందనలు. యువత శక్తికి భయపడి ప్రధానమంత్రి కేంద్ర మంత్రి ప్రధాన్‌ను తొలగించక తప్పలేదు. పరిస్థితిని మరింత సాగదీస్తే తమ కుర్చీకే ముప్పు వస్తుందని ప్రభుత్వానికి అర్థమైంది. ఆ భయంతోనే ప్రభుత్వం దిగివచ్చి యువత డిమాండ్లను అంగీకరించింది. అయితే, ఈ నిర్ణయం వెనుక విద్యార్థుల సమస్యలను అర్థం చేసుకుని పరిష్కరించాలనే చిత్తశుద్ధి కాదు. కేవలం తమ పదవిని కాపాడుకోవాలన్న స్వార్థం మాత్రమే దాగి ఉంది"

**మల్లికార్జున ఖర్గే, రాజ్యసభ ప్రతిపక్ష నేత**

### వర్సిటీల్లో ఆర్ ఎస్ ఎస్ వాళ్లనే తీసుకుంటున్నారు : ఖర్గే

పరీక్షలు, ఉద్యోగుల భర్తీకి జాబ్ క్యాలెండర్ విడుదల చేయాలని ఖర్గే అన్నారు. పాఠశాలలు, కళాశాలలు, వర్సిటీల్లో 10 లక్షల పోస్టులు ఖాళీగా ఉన్నాయని పేర్కొన్నారు. టీచర్ పోస్టులు భర్తీ చేయకుండా వికసిత్ భారత్ ఎలా సాధ్యమని ప్రశ్నించారు. వర్సిటీల్లో వీసీలు, ప్రొఫెసర్లలో ఆర్ఎస్ఎస్ వాళ్లనే తీసుకుంటున్నారని, అర్హతలు లేకుండానే వారిని నియమిస్తున్నారని విమర్శించారు. యూనివర్సిటీల్లో వీసీలు, బోధకులుగా సమర్థులనే నియమించాలని చెప్పారు. విద్యా వ్యవస్థలో మను స్మృతిని, ఆర్ఎస్ఎస్ సిలబస్‌ను పెడుతున్నారని ఆరోపించారు. వేద పాఠశాలల్లో చదివే బడుగు వర్గాలను వేధిస్తున్నారని అన్నారు.

### ఖర్గే వ్యాఖ్యలపై ఎన్‌డీఏ ఎంపీలు నిరసన

మల్లికార్జున ఖర్గే చేసిన వ్యాఖ్యలపై ఎన్ డీఏ ఎంపీలు నిరసన వ్యక్తం చేశారు. విద్యావ్యవస్థ, సిలబస్‌పై ఖర్గే చేసిన వ్యాఖ్యలపై క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా జేపీ నడ్డా మాట్లాడుతూ, మను స్మృతిపై ఖర్గే వ్యాఖ్యలతో సమాజంలో అశాంతి నెలకొంటుందని అన్నారు. ఇలాంటి విషయాలు సభలో ప్రస్తావించడం సరికాదని తెలిపారు. ఆ వ్యాఖ్యలను రికార్డుల నుంచి తొలగిస్తామని చెప్పారు.

# సంపాదకీయం

## ప్రతిఘటనతోనే ప్రజాస్వామ్యం పునరుద్ధరణ

రాజ్యాంగబద్ధ ప్రజాస్వామిక సమాజంలో వీధి నిరసన న్యాయసమ్మతమేనా? ఎన్నికలలో పోటీచేయడానికే ప్రాధాన్యమివ్వడం కాకుండా శాంతియుత, ప్రజాస్వామిక ప్రతిఘటనే ప్రతిపక్షాల పురోగతికి సరైన మార్గమని నేను ఇదే కాలమ్‌లో చేసిన వాదనకు ప్రతిస్పందనగా పలువురు నాకు ఆ ప్రశ్న వేశారు. భారతీయ జనతా పార్టీ ఐటీ సెల్ చీఫ్, దర్బారీ మీడియా యాంకర్ఇన్‌చీఫ్, అధికార పార్టీని సమర్థించే విద్యావేత్తలు నా వాదనపై ఆగ్రహావేశాలు వ్యక్తం చేశారు. ఆ వాదన ప్రజాస్వామ్య వ్యతిరేకమని, రాజ్యాంగ విరుద్ధమని, జాతివ్యతిరేకమని తప్పుపట్టారు. అసాధారణంగా జరిగిన యువజనుల నిరసన పాలక పార్టీ వర్గాలకు కలిగించిన నిరుత్సాహం నుంచే ఆ విమర్శలు వచ్చాయనేది స్పష్టం. ప్రజల్లో ప్రగాఢంగా ఉన్న భయసంకోచాలకు తెరదించిన అపూర్వ ప్రజా నిరసన అది. నా వాదనపై వచ్చిన విమర్శల్లో నిజాయితీ లోపించింది. విమర్శకులు చాలా తెలివిగా, తమకు అనుకూలంగా నా వాదనలోని 'శాంతియుత, ప్రజాస్వామిక' అనే పదబంధాన్ని విస్మరించారు. ప్రజల్లో విభేదాలు సృష్టించి, మత సామరస్యాన్ని దెబ్బతీసిన రథయాత్రతో అధికారానికి వచ్చినవారు, న్యాయ, రాజ్యాంగ నియమాలను ఉల్లంఘించినవారు వ్యవస్థలను గౌరవించడం గురించి ఉపన్యాసాలు ఇవ్వడం ప్రారంభించారు. రిజర్వేషన్లను వ్యతిరేకించినవారు, సామాజిక న్యాయ భావననే అంగీకరించనివారు స్వతంత్ర భారతదేశంలో పౌర శాసనోల్లంఘనకు వ్యతిరేకంగా అంబేడ్కర్ చేసిన వాదనలను ఉటంకిస్తున్నారు.  వాళ్ల విమర్శలు ఇలా ఉన్నాయి: ఒక ప్రజాస్వామిక వ్యవస్థలో ఒక సమస్యను, ఎన్నికైన ప్రజాప్రతినిధులను విస్మరించి, రాజ్యాంగ సంస్థలను ఉపేక్షించి, వీధి నిరసన ద్వారా ప్రభుత్వ దృష్టికి తీసుకువెళ్లేందుకు ప్రజలను సమీకరించడం సమర్థనీయమేనా? సమస్యలు, వివాదాలను పరిష్కరించుకునేందుకు రాజ్యాంగ సంస్థలను గౌరవించవలసిన అవసరం లేదా? వీధి నిరసనలు అంటే మూకస్వామ్యాన్ని స్వాగతించడం కాదా? మూకస్వామ్యం ప్రబలమయితే నిర్ణయాలు సహేతుకంగా తీసుకోవడం ఎలా సాధ్యమవుతుంది? మూకస్వామ్యం అరాచకానికి దారితీసి రాజ్యాంగబద్ధ పాలనను అసాధ్యం చేయదా? ఇది సమాజంలోని అణగారిన వర్గాల శ్రేయస్సుకు ఎలా దోహదం చేస్తుంది? ఈ ప్రశ్నలు నిరపాయకరమైనవిగా కనిపిస్తున్నాయి. అయితే వాటిలో లోపాలు ఉన్నాయి. రాజ్యాంగబద్ధ ప్రజాస్వామ్యంలో సంస్థలు సక్రమంగా పనిచేస్తాయనే సునిశ్చిత విశ్వాసంతోనే ఆ ప్రశ్నలు వేయడం జరిగింది. రాజ్యాంగబద్ధ ప్రజాస్వామ్యంలో సంస్థలు, వ్యవస్థలు సక్రమంగా ఉంటాయనేది ఒక మిథ్య. సమీకృతమైన ప్రజలు ఉన్మాద హంతక మూకలు కారు. ఒక ఉమ్మడి లక్ష్యంతో అనియతంగా సమావేశమైన జన బాహుళ్యమది. అలిఖిత నైతిక నియమావళి వారి ప్రవర్తనను నిర్దేశిస్తుంది. దీనిని మరింత వివరంగా చూద్దాం. ఆధునిక ప్రజాస్వామ్యాలు ప్రారంభంకాక ముందు లేదా వాటి తొలిదశలో ప్రజా సమూహాలు అందరికీ ఆమోదయోగ్యమైన, అప్పటికే సంప్రదాయపరంగా ఉన్న హక్కులను, పద్ధతులను అనుసరించేవని చరిత్రకారులు వివరించారు. 18వ శతాబ్దిలో ఇంగ్లాండ్‌లోని పెట్టుబడిదారీ వ్యవస్థకు వ్యతిరేకంగా అప్పటి ప్రజలు లాభాపేక్షలేని 'నైతిక ఆర్థిక వ్యవస్థ'ను (మోరల్ ఎకానమీ) కోరుకున్నారని ఈపీ థాంప్సన్ వివరించారు. సమష్టి శ్రేయస్సుకు భంగం కలగని రీతిలో ప్రజలు తమ ఆర్థిక, సామాజిక జీవితంలో వ్యవహరించేవారని ఆయన పేర్కొన్నారు. కాబట్టి, పాలనలో ప్రజల భాగస్వామ్యం అన్న భావనను ఉదారవాద ప్రజాస్వామ్యం కొత్తగా ఆవిష్కరించలేదు. సుదీర్ఘకాలంగా ఆచరణలో ఉన్న అసెంబ్లీలు, పిటిషన్లు, ప్రజాసమూహాల ఉమ్మడి నిరసన మొదలైన పద్ధతులను ఆధునిక ప్రజాస్వామ్యాలే వ్యవస్థీకృతం చేశాయి. అందువల్ల, ప్రజాప్రతిఘటన లేదా 'కలహశీల రాజకీయాల'ను ఆధునిక ప్రజాస్వామ్యాలు రూపుమాపలేవు. ప్రజాస్వామ్యం పనిచేసే తీరుతెన్నులలో అవి అంతర్భాగాలు. జవాబుదారీతనంతో కూడిన క్రమబద్ధమైన ప్రజాస్వామిక ఆచరణతో పాటు క్రమపద్ధతిలో లేని సామాన్య ప్రజల ఉమ్మడి కార్యాచరణ కూడా పనిచేసే ప్రజాస్వామ్య సజీవ లక్షణం. నిరసన ప్రదర్శనలు, సమ్మెలు, ధర్నాలు, బాయ్‌కాట్‌లు, శాసనోల్లంఘన మొదలైన అనియత పద్ధతుల రూపేణా తమ డిమాండ్లను ప్రభుత్వాల దృష్టికి తీసుకువెళ్లేందుకు సామాన్య పౌరులు ప్రయత్నిస్తుంటారు. ప్రజా ఉద్యమాలు ప్రజాస్వామిక వైఫల్యానికి చిహ్నాలు కావని పశ్చిమ యూరోప్‌లో గత అయిదు శతాబ్దాల కాలంలో సామాన్య ప్రజల ఉమ్మడి కార్యాచరణను నిశితంగా అధ్యయనం చేసిన చార్లెస్ టిల్లీ అనే చరిత్రకారుడు అభిప్రాయపడ్డారు. ప్రజాఉద్యమాలు వాస్తవానికి ప్రజాస్వామిక పాలన పరిణామ క్రమంలో ఉద్భవించినవేనని ఆయన అన్నారు. అవి వ్యవస్థ పట్ల శత్రుపూర్వకమైనవి కావు. ప్రజా నిరసనలు తరచూ వ్యవస్థాగత సంస్కరణలకు దారితీస్తాయి. వ్యవస్థల సానుకూల ప్రతిస్పందన ప్రజలు మరింతగా సంఘటితమయ్యేందుకు ఉద్దీపన అవుతుందని చార్లెస్ టిల్లీ నిర్ధారించారు. గ్లోబల్ సౌత్ (ఆసియా, ఆఫ్రికా, లాటిన్ అమెరికా) ప్రజాస్వామిక వ్యవస్థల్లో ప్రజాసమీకరణల ప్రత్యేక పాత్రను గుర్తించడం చాలా ముఖ్యం. 20వ శతాబ్దంలో వలసపాలన నుంచి విముక్తమైన చాలా దేశాలు ఉదారవాద ప్రజాస్వామ్యాన్ని అనుసరించాయి. అయితే చాలా దేశాలలో ఆ పాలనా పద్ధతులు ప్రభావశీలంగా అమలయేందుకు అవసరమైన సంస్థాగత ప్రాతిపదికలు బలహీనమైనవి. భారత్ లాంటి ప్రజాస్వామిక సమాజంలో ప్రజా ఉద్యమాలు, నిరసనలు సంస్థాగత లోపాలు, లొసుగులను అధిగమించేందుకు దోహదం చేస్తున్నాయి. భారత్‌లో పెద్ద ఎత్తున ప్రజ్వరిల్లే ప్రజా నిరసనలు సంస్థాగత వైఫల్యాలకు అత్యవసర ప్రతిస్పందనలు కావని, భారత ప్రజాస్వామ్య తార్కికతలో

# అక్రమ రవాణా బాధితులకు ఏదీ భరోసా?



బాలల అక్రమ రవాణా అనేది అందరి కళ్లముందే సాగుతున్న సంఘటిత నేర వ్యవస్థ. గడచిన మూడేళ్లలో దేశంలో స్వచ్ఛంద సంస్థలు, ప్రభుత్వ విభాగాలు 1.50లక్షల మందికిపైగా చిన్నారులను మానవ అక్రమ రవాణా నుంచి రక్షించాయి. వీరిలో చాలామంది చిన్నారులు తమ కేసుల విచారణ ప్రారంభం కావాలని, చట్టం ప్రకారం తమకు దక్కాల్సిన పరిహారం అందాలని కోరుకుంటున్నారు. తమ జీవితాలను గాడిలో పెట్టుకునే అవకాశం కోసం వేచిచూస్తున్నారు. ప్రపంచ మానవ అక్రమ రవాణా నిరోధక దినోత్సవం సందర్భంగా... మానవ అక్రమ రవాణా అనేది ఒక గొలుసుకట్టు ప్రక్రియ. ఇందులో ఒక వ్యక్తిని గుర్తించడం, తరలించడం, ఒక చోట నిర్బంధించడం వంటివి ఉంటాయి. అవి బలవంతంగానో, మోసంతోనో, బాధితుల బలహీన పరిస్థితిని ఆసరాగా చేసుకునో సాగుతాయి. లైంగిక దోపిడీ, వెట్టిచాకిరీ, బానిసత్వం, బలవంతపు వివాహం, భిక్షాటన వంటి రూపాల్లో దోపిడీ చేయాలనే ఉద్దేశంతో జరుగుతాయి. అమెరికా 'ట్రాఫికింగ్ ఇన్ పర్సన్స్ 2025' నివేదిక ప్రకారం, ప్రపంచవ్యాప్తంగా ప్రభుత్వాలు 2024లో 1,02,027 మంది బాధితులను గుర్తించాయి. దోషులుగా తేలిన వారి సంఖ్య కేవలం 7,975 మాత్రమే. జాతీయ నేరగణాంకాల సంస్థ 2024లో 2,135 మానవ అక్రమ రవాణా కేసులను నమోదు చేసింది. వీటిలో మొత్తం 6,018 మంది బాధితులు ఉండగా, 2,297 మంది చిన్నారులే. ఇవన్నీ అక్రమ రవాణా కేసులుగా అధికారికంగా నమోదైనవే.

జవాబుదారీతనం కరవు

భారతదేశంలో మానవ అక్రమ రవాణా నేరాన్ని రాజ్యాంగం, భారతీయ న్యాయ సంహిత (బీఎన్ఎస్), పోక్సో చట్టం, జువెనైల్ జస్టిస్ చట్టం, ఇతర చట్టాల్లోని వివిధ నిబంధనల కింద ప్రస్తావించారు. ఈ చట్టాలన్నీ తమవంతు పాత్ర పోషిస్తున్నా, నేర నివారణ నుంచి నేరస్థులపై విచారణ, శిక్ష విధింపు, బాధితుల పునరావాసం వరకు మొత్తం ప్రక్రియకు పూర్తి బాధ్యత వహించే సంస్థ ఒక్కటీ లేదు. దీనివల్ల జవాబుదారీతనం ఉండటం లేదు. అందుకని ఇండియాకు ఇప్పుడు అన్ని చర్యలను ఒకే వ్యవస్థ ద్వారా సమన్వయపరిచే సమగ్ర చట్టం కావాలి. అది అక్రమ రవాణాదారులను సమర్థంగా నిరోధించడమే కాకుండా, బాధితులు పునరావాసం పొందుతూ, సమాజంలో గౌరవప్రదంగా కలిసిపోయేదాకా అండగా నిలవాలి. మానవ అక్రమ రవాణాను అడ్డుకునేందుకు పోలీసు, కార్మిక శాఖ, రైల్వేలు, స్థానిక సంస్థలు, న్యాయవ్యవస్థ అన్నీ కలిసి పనిచేయడం అవసరం. సమాజ భాగస్వామ్యమూ ముఖ్యమే. కుటుంబాలు, స్థానిక, పౌర సంస్థలన్నీ ఉమ్మడి బాధ్యతగా భావించాలి. ఇదంతా ఒక చిన్నారి అదృశ్యం కాకముందే మొదలవ్వాలి. చట్టం ప్రకారం మానవ అక్రమ రవాణా నేరం గురించి సమాచారం తెలిసిన ప్రతి వ్యక్తి, సమీపంలోని మేజిస్ట్రేట్‌కు లేదా పోలీసు స్టేషన్‌కు తెలియజేయాలి. గ్రామపంచాయతీ సభ్యులు, గ్రామనివాసులకూ ఇది వర్తిస్తుంది. ఇదొక విధాన సూచన మాత్రమే కాదు, ఇప్పటికే అమల్లో ఉన్న చట్టబద్ధమైన బాధ్యత. ఇలాంటి బాధ్యత తమపై ఉందనే విషయమూ చాలామందికి తెలియదు. తెలిసినా పట్టించుకోని వారిని జవాబుదారీగా నిలబెట్టే పరిస్థితులూ లేవు. పాఠశాలలు సైతం ఒక చిన్నారి బడికి తరచుగా గైర్హాజరవుతున్న దశలోనే అప్రమత్తమై సంబంధిత అధికారులకు సమాచారం ఇవ్వాలి. ప్రమాదానికి గురయ్యే అవకాశం ఉన్న పిల్లలను స్కాలర్‌షిప్‌లు, ప్రభుత్వ సంక్షేమ పథకాలతో అనుసంధానం చేస్తే, కుటుంబాల దగ్గరే సురక్షితంగా ఉండగలుగుతారు. పేదరికం కారణంగా అక్రమ రవాణాదారుల తప్పుడు హామీలను నమ్మి మోసపోకముందే వారికి ప్రభుత్వ సంక్షేమ ప్రయోజనాలు అందాలి. అక్రమ రవాణా జరిగే ప్రాంతాలు, రవాణా మార్గాలు, గమ్యస్థానాల వంటి రాష్ట్రాల్లో ప్రభుత్వ విభాగాలు  సమన్వయంతో పనిచేయాలి. బాధితులను రక్షించడంతోనే ప్రభుత్వ బాధ్యత ముగిసిపోకూడదు. దోపిడీ నుంచి బయటపడిన చిన్నారికి తగిన రక్షణ కల్పించకపోతే, మళ్లీ అక్రమ రవాణా ముఠాల బారిన పడే ప్రమాదం ఉంటుంది. అందుకని, బాలల సంక్షేమ కమిటీలు వారికి వైద్య చికిత్స, మానసిక కౌన్సెలింగ్, న్యాయ సహాయం, పరిహారం దక్కేలా చర్యలు తీసుకోవాలి. బాధిత చిన్నారులు తిరిగి విద్యను కొనసాగించేలా, జీవనోపాధి, నైపుణ్యాభివృద్ధి సాధించేలా సాయపడాలి. అయితే, అక్రమ రవాణాదారులు స్వేచ్ఛగా తిరుగుతున్నంత వరకు ఇవన్నీ ఆశించిన ఫలితాల్ని ఇవ్వవు. అందుకే ఫాస్ట్-ట్రాక్ కోర్టులు నిర్దిష్ట కాలవ్యవధిలోనే కేసుల విచారణను పూర్తి చేయాలి. ఆలస్యమయ్యేకొద్దీ బాధితుల మానసిక వేదన పెరుగుతుంది. బాధితులు, సాక్షులు బెదిరింపులకు గురయ్యే ప్రమాదం అధికమవుతుంది. సంఘటిత నేర ముఠాలు తమ కార్యకలాపాలను కొనసాగించడానికి ఇది అవకాశాన్ని కల్పిస్తుంది.

### ఆస్తులు జప్తు చేయాలి

మానవ అక్రమ రవాణా నేరాన్ని ఎదుర్కొనే చర్యలు సరిహద్దులకు అతీతంగా ఉండాలి. ఇందుకోసం నిఘా సమాచార మార్పిడి, సంయుక్త దర్యాప్తులు, నిందితుల అప్పగింత, పరస్పర న్యాయ సహకారం, అక్రమ లావాదేవీలను గుర్తించే ఆర్థిక దర్యాప్తులు అవసరం. వీటితోపాటు, మానవ అక్రమ రవాణా నేరాల్లో దోషులుగా తేలిన వారి వివరాలతో ఒక అంతర్జాతీయ డేటా వ్యవస్థ ఉండాలి. దీనివల్ల ఒక దేశంలో చిన్నారిని అక్రమ రవాణా చేసిన వ్యక్తి, మరో దేశంలో అదే నేరాన్ని సులభంగా చేయలేడు. డబ్బు చెల్లించేందుకు కొనుగోలుదారులు, లాభపడాలనే స్వార్థపరులు సిద్ధంగా ఉండటం వల్లే వాణిజ్యపరమైన లైంగిక దోపిడీ కొనసాగుతోంది. ఈ నేరంలో డబ్బు చెల్లించే కస్టమర్ కూడా భాగస్వామే. ఇంత పెద్ద గొలుసులో ఒక వ్యక్తిని మాత్రమే అరెస్టు చేయడంకంటే, మొత్తం నేర ముఠాను ఛేదించి, దానిద్వారా సంపాదించిన అక్రమ ఆస్తులను జప్తు చేస్తేనే ఫలితం ఉంటుంది. దీనివల్ల వ్యవస్థీకృత మానవ అక్రమ రవాణాపై తీవ్రమైన దెబ్బ పడుతుంది. ప్రతి చిన్నారి చట్ట పరిరక్షణలో సురక్షితంగా ఎదుగుతున్నాడా, సంఘటిత నేర ముఠాలు వారిని చేరకముందే రక్షణ వ్యవస్థలు అండగా నిలుస్తున్నాయా అనేదాని ఆధారంగానే నిజమైన అభివృద్ధి చెందిన భారతాన్ని కొలవాలి.

# సూర్యాపేటకు జరిగిన నాటి జల అన్యాయం.. మళ్లీ పునరావృత్తమయ్యేనా?

కేంద్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా భావించి ప్రతిపాదించిన బుల్లెట్ ట్రైన్ కారిడార్‌లలో శంషాబాద్‌చెన్నై కారిడార్ ఒకటి. రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్, పార్లమెంట్‌లో వెల్లడించిన వివరాల ప్రకారం ఈ కారిడార్ బాటసింగారం, చౌటు ప్పల్, చిట్యాల, నకిరేకల్, సూర్యాపేట, మునగాల, కోదాడ మీదు గా వెళ్లేలా ప్రాథమిక అలైన్‌మెంట్‌ను ఖరారు చేశారు. అయితే, రాష్ట్ర ప్రభుత్వం ఈ అలైన్‌మెంట్‌ను మార్చి రంగారెడ్డి జిల్లా, నల్లగొండ జిల్లా (హాలియా) మీదుగా గుంటూరు జిల్లా దాచేపల్లిలోకి ప్రవేశించేలా ప్రతిపాదించినట్లు తెలుస్తోంది.



### పెరుగుతున్న రద్దీని నివారించేందుకు..

ప్రస్తుతం నల్లగొండ జిల్లా మీదుగా 14 రైళ్లు నడుస్తున్నాయి.. అలాగే హైదరాబాద్‌విజయవాడ జాతీయ రహదారి-65 దేశంలోనే అత్యంత రద్దీగా ఉండే రహదారుల్లో ఒకటి. పండుగలు, సెలవుల సమయంలో వేలాది కార్లు, వందలాది బస్సులు, భారీ సంఖ్యలో లారీలు ఈ మార్గంలో ప్రయాణిస్తుంటాయి. ఈ పెరుగుతున్న రద్దీని తగ్గించేందుకు, ప్రయాణ సమయాన్ని కుదించేందుకు, సౌకర్యవంతమైన రవాణాను అందించేందుకు కేంద్ర ప్రభుత్వం బుల్లెట్ ట్రైన్ కారిడార్‌ను ప్రతిపాదిస్తే, ప్రభుత్వం దీనిని మార్చ డాన్ని జాతీయ రహదారి-65 పరిసర ప్రాంతాల ప్రజలతో పాటు విజయవాడ ప్రాంత ప్రజలు కూడా వ్యతిరేకిస్తున్నారు.. నిజా నికి ఈ కారిడార్ వల్ల ఐదు దశాబ్దాలుగా ప్రజలను ఊరిస్తున్న సూర్యాపేట రైల్వే మార్గం కల కూడా నెరవేరుతుంది. జిల్లా కేంద్రా నికి రైల్వే అనుసంధానం లభిస్తుంది. పైగా ఈ కారిడార్ నిర్మాణం వల్ల రహదారులపై ట్రాఫిక్ భారం తగ్గడంతో పాటు కాలుష్యం, రోడ్డు ప్రమాదాలు కూడా తగ్గే అవకాశం ఉంది. అంతేకాకుండా, జాతీయ రహదారి-65కు సమాంతరంగా అలైన్‌మెంట్ ఉండటం వల్ల భూసేకరణ సమస్యలు కూడా తక్కువగా ఉంటాయి.

### ప్రతిపాదిత మార్గం.. తెలంగాణకు నష్టం!

కానీ తెలంగాణ ప్రభుత్వం ప్రతిపాదిత కొత్త మార్గం ఫ్యూచర్ సిటీ నుండి హైదరాబాదులోని కార్యాలయాలకు వెళ్లాలంటే కనీసం గంటకు పైగా సమయం పడుతుంది. ఇది ఎవరికీ అనుకూ లమైంది కూడా కాదు.. దీనికి తోడు గుట్టలు, చిట్టడవులు కలిగి ఉండి ఎలాంటి పట్టణాలు లేని దారి ఇది. శంషాబాద్ నుండి బయలుదేరితే పది పదిహేను నిమిషాల్లో ఆంధ్రకు చేరుతుంది. ఇదే జరిగితే తెలంగాణ ప్రాంతానికి జరిగే అతిపెద్ద నష్టం ఇది. సూర్యాపేట చైతన్యవంతమైన ప్రాంతం, ఉద్యమాల గడ్డగా పేరొందింది. ప్రస్తుతం సూర్యాపేటలో బుల్లెట్ రైలు సాధన ఉద్యమ నిప్పురవ్వ అంటుకుంది.. ఇది చౌటుప్పల్ నుండి కోదాడ వరకు మంటలుగా వ్యాపిస్తుంది. గతంలో నాగార్జునసాగర్ ప్రాజెక్టు విషయంలో కూడా ఇలాంటి అన్యాయం జరిగింది. నాడు ఆ ప్రాజెక్టును నల్గొండలో ఫ్లోరిన్ సమస్యను నివారించడంతో పాటు, సాగునీటి సమస్యను పరిష్కరిస్తుందని భావించారు. కానీ ఆంధ్ర నాయకులు కుట్ర చేసి ఈ ప్రాజెక్టు నందికొండ వద్ద నిర్మించారు. ఆనాడు నదీ జలాల విషయంలో జరిగిన అన్యాయం, నేడు బుల్లెట్ ట్రైన్ అలైన్‌మెంట్ విషయంలోనూ కొనసాగుతోందనే అభిప్రా యం వ్యక్తమవుతోంది.

### ఖరారైనా అలైన్‌మెంట్ కొనసాగించాలంటూ..

ఆసియా ఖండంలోనే రెండో అతిపెద్ద జాతరగా పేరుగాంచిన దురాజ్‌పల్లి జాతర సూర్యాపేట జిల్లాలోనే నిర్వహించబడుతుంది. గతంలో తెలంగాణలో అతిపెద్ద వ్యవసాయ మార్కెట్ కూడా సూర్యాపేటలోనే ఉండేది. హైదరాబాద్‌విజయవాడ జాతీయ రహదారి మధ్యలో ఉన్న ఈ ప్రాంతం వాణిజ్యపరంగా కూడా కీలకమైనది. సద్దల చెరువు, పుల్లారెడ్డి చెరువు, నల్లచెరువు వంటి నీటి వనరులతో అభివృద్ధి చెందిన ఈ ప్రాంతం ఆధ్యాత్మికంగా, చారిత్రకంగా పిల్లల మర్రి, నాగులపాడు శివాలయాలతో ప్రత్యేక గుర్తింపు పొందింది. కాబట్టి రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికైనా పునరాలోచించి, ఇప్పటికే ఖరారైన బుల్లెట్ ట్రైన్ కారిడార్ అలైన్‌మెంట్‌ను యథా తథంగా కొనసాగించాలనే లక్ష్యంతో దశలవారీ ఉద్యమ కార్యాచరణకు సిద్ధమవుతున్నారు.

# రేవంత్‌కు బుద్ధి చెప్పేది జెన్-జీనే!




ఢిల్లీలో జంతర్ మంతర్ వద్ద జెన్ జీల ఉద్యమ విజయం దేశంలోని అన్ని రాజకీయ పక్షాలను ఆలోచనలో పడేసింది. జెన్ జీని తేలిగ్గా తీసుకునే అవకాశం కనిపించడం లేదు. 'జెన్ జీలు మురికిగుంటలో ఉండే తరం' అంటూ బీజేపీ ఎంపీ కంగనా రనౌత్ తన నోటిదురుసుతనాన్ని ప్రదర్శించినా, జెన్ జీలో ఇద్దరు, ముగ్గురిని ఉరితీయాలని కొందరు బీజేపీ నాయకులు తమ వాచలత్వాన్ని ప్రదర్శించినా ఏ రాజకీయ పక్షం కూడా జెన్ జీని దూరం చేసుకునే సాహసం చేయలేదు. ఉమ్మడి రాష్ట్రంలో కాంగ్రెస్‌కు కనీసం ప్రతిపక్ష హోదా కూడా దక్కని 1994-95 ఎన్నికల్లో కూడా ఆ పార్టీ బేస్ ఓటు బ్యాంకు అలాగే ఉన్నది. తటస్థులు, కొత్త ఓటర్లు ఫలితాలను నిర్ణయిస్తారు. ఇప్పుడు జెన్ జీ ఈ పాత్ర పోషిస్తుంది. అందరు పాలకులు తమను తాము సంస్కరించుకోవాల్సిన అవసరం జెన్ జీ కల్పించింది. 13 ఏండ్ల పాలనలో ప్రధాని మోడీ తొలిసారి ఒక మంత్రితో రాజీనామా చేయించినా, అర్ధరాత్రి 12 గంటలకు తొలిసారి మోదీ 'ఫ్రెండ్స్' అంటూ ఇన్‌స్టాగ్రామ్ రీల్స్‌లో మాట్లాడారు. ఒకవైపు బీజేపీ వాట్సాప్ యూనివర్సిటీ మహాత్మాగాంధీని దేశద్రోహి అని ప్రచారం చేస్తున్నది. మరోవైపు ప్రధాని గాంధీజీకి నివాళులు అర్పిస్తారు. బీజేపీ విభాగాలు జెన్ జీని బూతులు తిడుతుంటాయి. జంతర్ మంతర్‌లో జెన్ జీ విజయం తర్వాత తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హైదరాబాద్‌లో ఇంగ్లిష్ మీడియాతో పిచ్చాపాటి మాట్లాడారు. జెన్ జీని ఆకట్టుకోవడం గురించి గంటల తరబడి చర్చించారు. ఏ ఇంగ్లిష్ జర్నలిస్ట్ తెలుగులో ఇచ్చిన సలహానో కానీ ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థుల వయసును 25 ఏండ్ల నుంచి 21కి కుదించాలని అసెంబ్లీలో తీర్మానం చేయాలని నిర్ణయించారు. తీర్మానం చేస్తే ఏమవుతుందో? తెలంగాణ అసెంబ్లీ తీర్మానం మీద మన దేశం నడుస్తుందా? 25 నుంచి 21కి మార్చడం సరే, ఇప్పటివరకు ఉన్న 25 ఏండ్ల వారిలో ఎంతమందికి టికెట్లు ఇచ్చారు. ఏఐసీసీ అధ్యక్షుడి వయసు ఎంత? అనే ప్రశ్నలు రావా? పోటీ చేసే వయసు 21 ఏండ్లకు తగ్గించాలని అసెంబ్లీలో తీర్మానం చేస్తే ఆ రోజు మీడియాలో ప్రచారం లభిస్తుంది తప్ప అంతకుమించి ఏమవుతుంది. వాస్తవానికి కాంగ్రెస్ దేశవ్యాప్తంగా బలహీనపడింది యువశక్తితోనే. 1988లో రాజీవ్ గాంధీ హయాంలో ఓటుహక్కును 21 నుంచి 18 ఏండ్లకు తగ్గించారు. 1989లో ఎన్నికలు జరిగాయి. అప్పటినుంచి కాంగ్రెస్‌కు ఓట్ల శాతం తగ్గుతూ వచ్చింది. 1984లో ఈ పార్టీకి 48 శాతం ఓట్లు వస్తే 18 ఏండ్లకు ఓటుహక్కు అమల్లోకి వచ్చిన 1989లో 39.5 శాతం, 1991లో 36%, 1996లో 28.8%, 1999లో 28.3%, 2004 లో 26.5%, 2009లో 28.6%, 2014లో 19.5%, 2019లో 19.5%, 2024లో 21.2 శాతం ఓట్లు వచ్చాయి. కాంగ్రెస్ బలహీనపడడానికి అనేక కారణాలు ఉండవచ్చు. యువత ఆ పార్టీకి దూరం కావడం ప్రధాన కారణంతెలంగాణలో 3.35 కోట్ల మంది ఓటర్లు ఉండగా వారిలో 18 నుంచి 29 ఏండ్ల వరకు ఉన్న జెన్ జీ ఓటర్లు 24.26 శాతం మంది ఉన్నారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు 39.4 శాతం ఓట్లు వస్తే బీఆర్ఎస్‌కు 37.35 శాతం వచ్చాయి. ఈ రెండు పార్టీల మధ్య తేడా రెండు శాతమే. బీఆర్ఎస్ కన్నా కాంగ్రెస్‌కు కేవలం 4.82 లక్షల ఓట్లు ఎక్కువ వచ్చాయి. రాష్ట్రంలో 18-19 ఏండ్ల వయసు ఓటర్లే 5.45 లక్షల మంది ఉన్నారు. ఏ పార్టీ ఓటుబ్యాంకు ఆ పార్టీకే ఉన్నా 18 నుంచి 29 ఏండ్ల వయసులో ఉన్న జెన్ జీ ఓటర్లు 24. 26 శాతం మంది 'అధికారమనే అహంకారానికి' చరమగీతం పాడే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఎందుకంటే వారికి ఉద్యోగాలు లేవు, ఆశావహ పరిస్థితులు లేవు, ప్రోత్సాహాన్ని అందించే వాతావరణమూ లేదు. 'ఎంత గొప్ప నృత్య దర్శకుడైనా సినీహీరో కృష్ణతో డ్యాన్స్ చేయించలేరు' అని పాతరోజుల్లో ఓ జోక్ ఉండేది. ఇంగ్లిష్ మీడియా సలహా ఇవ్వగలదు. కానీ జెన్ జీని ఆకట్టుకునే లక్షణాలు మన సీఎంలో ఉండాలి కదా? రాహుల్ గాంధీ ప్రధాని కాగానే జెన్ జీని విద్యాశాఖ మంత్రిని చేయడం తన బాధ్యత అని రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చారు. తెలంగాణలో అధికారంలోకి వచ్చి రెండున్నరేండ్లు గడిచినా విద్యాశాఖ మంత్రిని నియమించే తీరిక లేదు, విద్యార్థుల సమస్యలు పట్టించుకునే ఓపికా లేదు, హామీ ఇచ్చిన రెండు లక్షల ఉద్యోగాల భర్తీ ఊసేలేదు. కానీ కేంద్రంలో విద్యాశాఖ మంత్రి నియామకం బాధ్యత తీసుకున్నారు. విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించమంటే పక్క రాష్ట్రంలో చెల్లించడం లేదని వాదన. తెలంగాణ ఏమైనా పక్క రాష్ట్రానికి అనుబంధ రాష్ట్రమా? వెంటనే జెన్ జీ ఇమేజ్‌ను క్యాష్ చేసుకోవాలనే ఆత్రం తప్ప వారి సమస్యలపై ఏ మాత్రం ఆసక్తి లేదు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ రాజకీయాల్లోకి వచ్చినప్పటి నుంచే జెన్ జీలో కలిసిపోయారు. ఐటీ మంత్రిగా నవతరానికి దగ్గరయ్యారు. బడా ఐటీ కంపెనీలను హైదరాబాద్‌కు తీసుకురావడమే కాదు టీ హబ్ ఏర్పాటు ద్వారా యువతకు చేరువయ్యారు. చివరకు అధికారం నుంచి దిగిపోయిన తర్వాత కూడా అంతర్జాతీయ సదస్సులకు పిలిస్తే వెళ్లి యువతను ఆకట్టుకునేలా మాట్లాడుతున్నారు. ఒక రాష్ట్రానికి ప్రాతినిధ్యం వహించేటప్పుడు ఆ రాష్ట్ర ప్రతిష్ఠ పెంచేలా మాట్లాడాలనే అవగాహనతో కేటీఆర్ మాట్లాడుతున్నారు. కానీ రేవంత్‌రెడ్డి విషయానికి వస్తే.. పాఠశాలల పిల్లల సమావేశంలో కూడా ఏవో బూతులు, ప్రత్యర్థి పార్టీల నేతల చావును కోరుకోవడం, వారి రక్తం పొలాలకు పారించాలని ఇష్టారీతిన మాట్లాడుతున్నారు. ఇలాంటి నాయకుడు జెన్ జీకి ఎలా చేరువవుతారు. తన నోటి ద్వారా రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ఎప్పుడో యువతకు దూరమైంది. సంప్రదాయంగా కాంగ్రెస్ ఓటర్లుగా ఉన్నవారే ఆ పార్టీకి దూరమవుతుంటే ఇక నవతరం ఎందుకు చేరువవుతుంది. గతంలో జెన్ జీ కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా బీజేపీపై ఆసక్తి చూపేవారు. కానీ మతం పేరుతో విభజన తప్ప.. హామీ ఇచ్చినట్టు ఏటా రెండు కోట్ల ఉద్యోగాలు లేవు, ఏ వర్గానికీ సంతృప్తి లేదు. యువతలో ఏ మేరకు అసంతృప్తి ఉందో జంతర్ మంతర్ ఘటన దేశానికి చాటిచెప్పింది. ఒకప్పుడు ఊరిలో మోతుబరి ఎవరికి ఓటు వేయమంటే వారికి వేసేవారు. ఆ తర్వాత కాలంలో భర్త చెప్పినట్టు భార్య ఓటు వేసేది. ఇప్పుడు జెన్ జీ సొంతంగా ఆలోచించి నిర్ణయం తీసుకునే తరం.

## కేవలం రూ.259కే ఇంట్లో హై-స్పీడ్ ఇంటర్నెట్ 700GB డేటా, ఉచిత కాలింగ్,ఇవి యాక్సెస్



ఈ కొత్త ప్లాన్‌లో వినియోగదారులు 25వీఎజూం వరకు ఇంటర్నెట్ వేగాన్ని పొందుతారు. ఈ వేగంతో ఎణ వీడియో స్ట్రీమింగ్, వీడియో కాలింగ్, వెబ్ బ్రౌజింగ్ సాధ్యమవుతాయి. ఇంటర్నెట్‌తో పాటు ఈ ప్లాన్‌లో బీఎస్ఎన్ఎల్ అపరిమిత వాయిస్ కాలింగ్ సౌకర్యాన్ని కూడా.. బీఎస్ఎన్ఎల్ గ్రామీణ ప్రాంతాల కోసం రూ.300కే కొత్త బ్రాడ్‌బ్యాండ్ ప్లాన్‌ను ప్రవేశపెట్టింది. మీరు అత్యంత ప్రాథమిక సేవను ఎంచుకున్నప్పటికీ, బ్రాడ్‌బ్యాండ్ ప్లాన్‌లకు సాధారణంగా నెలకు కనీసం రూ. 400 ఖర్చవుతుంది. కానీ బీఎస్ఎన్ఎల్ తన ప్రచార ఆఫర్ కింద గ్రామీణ వినియోగదారుల కోసం రూ. 259కే కొత్త బ్రాడ్‌బ్యాండ్ ప్లాన్‌ను ప్రారంభించింది. తక్కువ బడ్జెట్‌లో ఇల్లు లేదా చిన్న కార్యాలయం కోసం ఇంటర్నెట్ కనెక్షన్ కోరుకునే వారిని దృష్టిలో ఉంచుకుని ఈ ప్లాన్‌ను ప్రత్యేకంగా రూపొందించినట్లు కంపెనీ చెబుతోంది. ఇది ఇంటర్నెట్‌తో పాటు కాలింగ్, కొన్ని వినోద ప్రయోజనాలను కూడా అందిస్తుంది. ఈ ప్లాన్ ఒక ముఖ్యమైన లక్షణం ఏమిటంటే కొత్త బ్రాడ్‌బ్యాండ్ కనెక్షన్‌ను కొనుగోలు చేసేటప్పుడు కస్టమర్ల నుండి ఎటువంటి ఇన్‌స్టాలేషన్ ఫీజు వసూలు చేయరు. అంటే మొత్తం కనెక్షన్ సెటప్ ప్రక్రియ ఉచితంగా ఉంటుంది. అంతేకాకుండా ఇంటర్నెట్ యాక్సెస్ కోసం అవసరమైన వై-ఫై మోడెమ్ కూడా ఎటువంటి అదనపు ఖర్చు లేకుండా అందిస్తారు. దీనివల్ల కస్టమర్లకు ఎలాంటి ప్రారంభ ఖర్చులు ఉండవు. ఈ ప్లాన్ మరింత సరసమైనదిగా మారుతుంది.

**ఎలాంటి ప్రయోజనాలు ఉంటాయి..?**

ఈ బీఎస్ఎన్ఎల్ ప్లాన్ వినియోగదారులకు 700GB డేటాను అందిస్తుంది. అయితే ఇది పూర్తిగా అపరిమితం కాదు. మీరు ఆన్‌లైన్ చదువులు, వీడియోలు చూడటం, సోషల్ మీడియా, ఈమెయిల్ లేదా సాధారణ ఆఫీస్ పనుల కోసం ఇంటర్నెట్ ఉపయోగిస్తే, చాలా మంది వినియోగదారులకు 700GB డేటా సరిపోతుంది. బీఎస్ఎన్ఎల్ ఈ కొత్త ప్లాన్‌లో వినియోగదారులు 25వీఎజూం వరకు ఇంటర్నెట్ వేగాన్ని పొందుతారు. ఈ వేగంతో ఎణ వీడియో స్ట్రీమింగ్, వీడియో కాలింగ్, వెబ్ బ్రౌజింగ్ సాధ్యమవుతాయి. ఇంటర్నెట్‌తో పాటు ఈ ప్లాన్‌లో బీఎస్ఎన్ఎల్ అపరిమిత వాయిస్ కాలింగ్ సౌకర్యాన్ని కూడా అందిస్తోంది. అంటే వినియోగదారులు ఇంటర్నెట్‌తో పాటు ల్యాండ్‌లైన్ కాలింగ్ ప్రయోజనాలను కూడా పొందవచ్చు.

## ఇక దుకాణాలు, రెస్టారెంట్లు, కార్యాలయాలు 24 గంటలు ఓపెన్ అక్కడి ప్రభుత్వం కీలక నిర్ణయం..!



ప్రస్తుతం కోల్‌కతా వంటి పెద్ద నగరాల్లో మాత్రమే ఈ 24 గంటల దుకాణాలు, రెస్టారెంట్లు, కార్యాలయాలు, లాజిస్టిక్స్ సేవలు, ఆతిథ్య సంస్థలను తెరిచి ఉంచడానికి అనుమతి ఉంటుంది. అయితే ఈ 24 గంటల సేవలను ప్రయోగాత్మకంగా ఒక పైలట్ ప్రాజెక్ట్‌గా తీసుకురానున్నారు.. కొత్త ప్రభుత్వం తన తొలి బడ్జెట్‌లోనే రాష్ట్ర ఆదాయాన్ని పెంచేందుకు ఒక పెద్ద ముందడుగు వేసింది. త్వరలో రాష్ట్రంలో దుకాణాలు, రెస్టారెంట్లు, కార్యాలయాలను 24 గంటలూ తెరిచి ఉంచడానికి రాష్ట్ర ప్రభుత్వం అనుమతించనుంది. దీనివల్ల ఉపాధి అవకాశాలు పెరుగుతాయి. పశ్చిమ బెంగాల్‌లో బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి, వ్యాపార వాతావరణాన్ని మార్చిన తర్వాత రాష్ట్ర ప్రభుత్వం ఈ ప్రకటన చేసింది.

దీని వల్ల ప్రయోజనం ఏమిటి?

గతంలో 'పశ్చిమ బెంగాల్ దుకాణాలు, సంస్థల చట్టం 1963' ప్రకారం దుకాణాలు తెరిచి ఉంచడానికి ఒక నిర్దిష్ట సమయ పరిమితి ఉండేది. ఈసారి రాష్ట్ర ప్రభుత్వం ఆ విషయంలో మార్పు తీసుకురాబోతోంది. కొత్త ప్రభుత్వం ప్రకారం.. ఈ చట్టం రాష్ట్రంలోని వ్యాపార వాతావరణంలో అనేక అడ్డంకులను సృష్టించింది. ఇది వాణిజ్య మౌలిక సదుపాయాలను పూర్తిగా వినియోగించుకోవడానికి అనుమతించదు. ఫలితంగా, దుకాణదారుల ఆదాయం, ఉపాధి అవకాశాలు, పారిశ్రామిక రంగంలో ఉత్పాదకత ప్రభావితమవుతున్నాయి. ఈసారి దుకాణాలు, రెస్టారెంట్లు, కార్యాలయాలను 24 గంటలూ తెరిచి ఉంచడం ద్వారా ఈ సేవను సద్వినియోగం చేసుకోవాలని ప్రభుత్వం భావిస్తోంది.

ప్రభుత్వం ఈ సంస్కరణను ఎందుకు కోరుతోంది?

దుకాణాలు, రెస్టారెంట్లు, కార్యాలయాలను 24 గంటలూ తెరిచి ఉంచడం వల్ల రాష్ట్రంలో పెట్టుబడులకు అనుకూలమైన వాతావరణం ఏర్పడుతుందని ప్రభుత్వం భావిస్తోంది. ఈ విషయంలో ఇతర రాష్ట్రాల అనుభవాన్ని కూడా పరిగణనలోకి తీసుకుంది. అందువల్ల కార్మిక పరిరక్షణ విధానాన్ని పాటిస్తూనే ప్రభుత్వం ఈ పైలట్ ప్రాజెక్టు మార్గంలో ముందుకు సాగుతోంది. దుకాణాలు, రెస్టారెంట్లు, కార్యాలయాలతో పాటు, లాజిస్టిక్స్ సేవలు, ఆతిథ్య సంస్థలను కూడా 24 గంటలూ తెరిచి ఉంచడానికి అనుమతిస్తారు.


రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల్లో దుకాణాలు 24 గంటలూ తెరిచి ఉంటాయా?

ప్రస్తుతం కోల్‌కతా వంటి పెద్ద నగరాల్లో మాత్రమే ఈ 24 గంటల దుకాణాలు, రెస్టారెంట్లు, కార్యాలయాలు, లాజిస్టిక్స్ సేవలు, ఆతిథ్య సంస్థలను తెరిచి ఉంచడానికి అనుమతి ఉంటుంది. అయితే ఈ 24 గంటల సేవలను ప్రయోగాత్మకంగా ఒక పైలట్ ప్రాజెక్ట్‌గా తీసుకురానున్నారు. మరిన్ని ఉపాధి అవకాశాలు, అదనపు ఆదాయం కల్పించే లక్ష్యంతోనే ప్రభుత్వం ఈ చొరవ తీసుకుందని వ్యాపార వర్గాలు భావిస్తున్నాయి.

పెళ్లికాని విద్యార్థులకు పెద్ద ప్రకటన

రాష్ట్ర బడ్జెట్‌లో (పశ్చిమ బెంగాల్ బడ్జెట్ 2026) అవివాహిత విద్యార్థినుల కోసం రాష్ట్ర ప్రభుత్వం ఒక పెద్ద ప్రకటన చేసింది. ఇప్పటి నుండి ప్రభుత్వ, ప్రభుత్వ-సహాయక కళాశాలల్లో అండర్ గ్రాడ్యుయేట్ కోర్సులలో ప్రవేశం పొందే సమయంలో కొత్త ప్రభుత్వం ఒకేసారి రూ. 50,000 గ్రాంటును అందిస్తుంది. ప్రాథమికంగా ఉన్నత విద్యలో విద్యార్థినులు మధ్యలోనే మానేయడాన్ని (డ్రాపౌట్) నివారించడానికి రాష్ట్ర ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. ఇందుకోసం రాష్ట్ర ప్రభుత్వం రూ. 1000 కోట్లు కేటాయించాలని ప్రతిపాదించింది. గత సోమవారం జరిగిన బడ్జెట్ సమావేశంలో ఆర్థిక మంత్రి స్వపన్ దాస్‌గుప్తా ఈ ప్రకటన చేశారు.

## మహిళలకు గుడ్‌న్యూస్ నెల రోజుల్లో బంగారం ధర ఎంత తగ్గిందో తెలిస్తే షాకవుతారు!



అమెరికా, ఇరాన్‌ల మధ్య కాల్పుల విరమణ ఒప్పందం కుదిరింది. దీనివల్ల పశ్చిమ ఆసియాలో యుద్ధ ప్రమాదం తగ్గింది. ఫలితంగా పెట్టుబడిదారులు బంగారం, వెండి వంటి "సురక్షితమైన" పెట్టుబడుల నుండి తమ డబ్బును ఉపసంహరించుకున్నారు. ఫెడరల్ రిజర్వ్ ఈ సంవత్సరం.. ప్రస్తుతం బంగారం, వెండి ధరలు భారీ స్థాయిలో తగ్గుముఖం పడుతున్నాయి. గత నెల రోజులుగా బంగారం, వెండి ధరలను పరిశీలిస్తే భారీ స్థాయిలో తగ్గుముఖం పట్టాయి. నెల రోజుల కిందట అంటే మే 26వ తేదీన తులం బంగారం ధర రూ.1,60,000 వరకు ఉండగా, ప్రస్తుతం జూన్ 26న 1,41,600 వద్ద కొనసాగుతుంది. అంటే నెల రోజుల్లో రూ.18,400 వరకు దిగి వచ్చింది. ఇక సిల్వర్ విషయానికొస్తే.. కిలో వెండి ధర రూ.2,85,000 వద్ద కొనసాగుతుండగా, ప్రస్తుతం రూ.2,35000 వద్ద కొనసాగుతోంది. అంటే కేవలం నెల రోజుల్లోనే రూ.50 వేల వరకు తగ్గింది. ఈ ఏడాది బంగారం, వెండి ధరలు నిరంతరం హెచ్చుతగ్గులకు లోనవుతున్నాయి. 2025 డిసెంబర్ 31న బంగారం ధర రూ.1.33 లక్షలు ఉండగా, అది 2026 జనవరి 29న రూ.1.76 లక్షల గరిష్ట స్థాయికి చేరుకుంది. ఆ తర్వాత నుంచి బంగారం ధర రూ.36,000 మేర తగ్గింది. ఇదిలా ఉండగా, 2025 డిసెంబర్ 31న వెండి ధర రూ.2.30 లక్షలు ఉండగా, 2026 జనవరి 29 నాటికి అది రూ.3.86 లక్షలకు చేరుకుంది. వెండికి ఇప్పటివరకు నమోదైన అత్యధిక ధర ఇదే. అప్పటి నుండి 147 రోజుల్లో వెండి ధర రూ.1.69 లక్షలు తగ్గింది. అమెరికా, ఇరాన్‌ల మధ్య కాల్పుల విరమణ ఒప్పందం కుదిరింది. దీనివల్ల పశ్చిమ ఆసియాలో యుద్ధ ప్రమాదం తగ్గింది.

# వర్షాకాలం నిషేధం ఉన్నా యథేచ్ఛగా మట్టి తవ్వకాలు

- వర్షాకాలం 'సెల్లార్' ముప్పు.. ఎల్బీనగర్‌లో నిబంధనలకు పాతర!
- అధికారుల నిషేధం కాగితాలకే పరిమితం.. ప్రమాద ఘంటికలు మోగుతున్నా ప్రేక్షక పాత్రేనా?






నేటి దిక్సూచి - క్రైమ్/సిటీ బ్యూరో (ఎల్బీనగర్): ఆదేశాలు కాగితాలకే పరిమితం.. అమలు మాత్రం శూన్యం" అనే చందంగా మారింది ఎల్బీనగర్‌లో అధికారుల తీరు. వర్షాకాలంలో ప్రమాదాల నివారణే ధ్యేయంగా అధికారులు విధించిన సెల్లార్ తవ్వకాల నిషేధం ఎల్బీనగర్ జోన్ పరిధిలో క్షేత్రస్థాయిలో అమలుకు నోచుకోవడం లేదు. మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని ఎల్బీనగర్ కూడలి సమీపంలో నిబంధనలకు విరుద్ధంగా భారీ యంత్రాలతో సెల్లార్ మట్టి తవ్వకాలు సాగుతుండటంపై స్థానికులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వర్షాల కారణంగా నేల వదులై పక్కనే ఉన్న భవనాలు, రహదారులు కుంగిపోయే ప్రమాదం ఉందనే ఉద్దేశంతో వర్షాకాలం ముగిసే వరకు కొత్త సెల్లార్ తవ్వకాలను నిలిపివేస్తున్నట్లు ఉన్నతాధికారులు ప్రకటించారు. కానీ, ఎల్బీనగర్ నడిబొడ్డున పగలు, రాత్రి తేడా లేకుండా భారీ పొక్లెన్లు, టిప్పర్ల సాయంతో మట్టి తరలిస్తున్నా సంబంధిత టౌన్ ప్లానింగ్ అధికారులు కనీసం స్పందించకపోవడం పలు అనుమానాలకు తావిస్తోంది. అధికారులు ఇచ్చిన నిషేధ ఆదేశాలు కేవలం ప్రకటనలకే పరిమితమయ్యాయా లేక ఈ తవ్వకాలకు ప్రత్యేక అనుమతులు ఏవైనా ఇచ్చారా అని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. అత్యంత రద్దీగా ఉండే ఎల్బీనగర్ ప్రాంతంలో ముందస్తు రక్షణ చర్యలు లేకుండా ఇటువంటి తవ్వకాలు జరపడం వల్ల పరిసర భవనాలకు, రహదారులకు తీవ్ర ముప్పు వాటిల్లే అవకాశం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఇప్పటికైనా మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ ఉన్నతాధికారులు, విజిలెన్స్ బృందాలు తక్షణమే స్పందించి క్షేత్రస్థాయిలో పరిశీలన జరపాలి. నిబంధనలను ఉల్లంఘించి జరుగుతున్న తవ్వకాలను వెంటనే నిలిపివేసి, బాధ్యులైన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని స్థానిక ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

# బడిదారిని కాపాడాల్సిన ఎమ్మార్వో మౌనం ఎందుకు..?


### కస్తూరిబా పాఠశాల ప్రభుత్వ రహదారిపై వెంచర్ బాట..! ఫిర్యాదులు చేసినా స్పందన శూన్యం.. అధికారుల తీరుపై గ్రామస్థుల ఆగ్రహం



నల్గొండ/మర్రిగూడ, నేటి దిక్సూచి: ప్రభుత్వ భూములు, రహదారులను పరిరక్షించాల్సిన బాధ్యత రెవెన్యూ అధికారులపై ఉంటుంది. అయితే మర్రిగూడ మండలంలో కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయానికి వెళ్లే ప్రభుత్వ రహదారిని ప్రైవేట్ వెంచర్ అవసరాలకు



వినియోగిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నప్పటికీ, స్థానిక ఎమ్మార్వో స్పందించకపోవడం తీవ్ర చర్చనీయాంశంగా మారింది. పలుమార్లు ఫిర్యాదులు అందినా క్షేత్రస్థాయిలో పరిశీలన జరగకపోవడం వెనుక కారణాలేమిటన్న ప్రశ్నలు గ్రామస్థుల నుంచి వ్యక్తమవుతున్నాయి. రాజు పేట గ్రామ పంచాయతీ వార్డు సభ్యులు గ్రామస్తులు, పాఠశాలకు విద్యార్థినులు, ఉపాధ్యాయులు ఉపయోగించే ఏకైక ప్రభుత్వ రహదారిని వెంచర్ నిర్వాహకులు తమ అవసరాలకు వినియోగిస్తున్నారని చెబుతున్నారు. దీనివల్ల భవిష్యత్తులో విద్యార్థినుల రాకపోకలకు



ఆటంకం ఏర్పడే ప్రమాదం ఉందని వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సాధారణ ప్రజలు ప్రభుత్వ భూమిలో చిన్నపాటి ఆక్రమణ చేసినా వెంటనే చర్యలు తీసుకునే రెవెన్యూ యంత్రాంగం, ఈ అంశంలో మాత్రం మౌనం పాటించడం పలు అనుమానాలకు తావిస్తోందని స్థానికులు ఆరోపిస్తున్నారు. వెంచర్ నిర్వాహకుడికి అధికారుల అండ ఉందనే ప్రచారం మండలంలో జరుగుతోందని వారు పేర్కొంటున్నారు. ప్రభుత్వ రహదారి సరిహద్దులను వెంటనే గుర్తించి, ఆక్రమణలు జరిగి ఉంటే తొలగించాలని గ్రామస్థులు డిమాండ్ చేస్తున్నారు. జిల్లా కలెక్టర్, ఉన్నత రెవెన్యూ అధికారులు ఈ వ్యవహారంపై ప్రత్యేక దృష్టి సారించి క్షేత్రస్థాయిలో విచారణ జరిపి వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలని కోరుతున్నారు. ఈ ఆరోపణలపై స్థానిక ఎమ్మార్వో, సంబంధిత వెంచర్ నిర్వాహకుల స్పందన కోసం ప్రయత్నించగా, వారి నుంచి వివరణ అందలేదు.

# ఐఫోన్ 16పై భారీ తగ్గింపు.. రూ.20,000 ఆదా చేసుకునే సువర్ణావకాశం..!



ప్రపంచంలో అత్యధికంగా అమ్ముడైన ఫోన్ అయిన ఈ ఐఫోన్‌లో అనేక గొప్ప ఫీచర్లు ఉన్నాయి. ఐఫోన్ 17 విడుదలైన తర్వాత కూడా దీని అమ్మకాలు తగ్గలేదు. అలాగే ప్రజలు దీనిని ఎంతగానో ఇష్టపడుతున్నారు. మీరు కూడా శక్తివంతమైన ఫీచర్లు, ఆపిల్ అనుభవం కోసం.. ఆపిల్ అత్యంత ప్రజాదరణ పొందిన ఐఫోన్‌లలో ఒకటైన ఐఫోన్ 16 ప్రస్తుతం తగ్గింపులను పొందుతోంది. దీనిని సద్వినియోగం చేసుకోవడం ద్వారా మీరు రూ. 20,000 వరకు ఆదా చేసుకోవచ్చు. గత సంవత్సరం ప్రపంచంలో అత్యధికంగా అమ్ముడైన ఫోన్ అయిన ఈ ఐఫోన్‌లో అనేక గొప్ప ఫీచర్లు ఉన్నాయి. ఐఫోన్ 17 విడుదలైన తర్వాత కూడా దీని అమ్మకాలు తగ్గలేదు. అలాగే ప్రజలు దీనిని ఎంతగానో ఇష్టపడుతున్నారు. మీరు కూడా శక్తివంతమైన ఫీచర్లు, ఆపిల్ అనుభవం కోసం ఐఫోన్ కొనాలనుకుంటే ఈ ఐఫోన్ 16 ఒక గొప్ప ఎంపిక కావచ్చు. ఈ ఐఫోన్‌లో ఏయే ఫీచర్లు ఉన్నాయో, దీనిని ఏ ధరకు కొనుగోలు చేయవచ్చో తెలుసుకుందాం..

**ఐఫోన్ 16 స్పెసిఫికేషన్లు:**

2024లో విడుదలైన ఐఫోన్ 16, 6.1-అంగుళాల ూాజుణ డిస్‌ప్లేను కలిగి ఉంది. ఇది 60ఎఓ రిఫ్రెష్ రేట్, ఎణ= కంటెంట్ సపోర్ట్, 2,000 నిట్స్ గరిష్ట ప్రకాశాన్ని అందిస్తుంది. ూ18 ప్రాసెసర్‌తో కూడిన ఈ ఐఫోన్, మల్టీటాస్కింగ్, ఆపిల్ ఇంటెలిజెన్స్ ఫీచర్లను సులభంగా నిర్వహిస్తుంది. అధిక పనితీరుతో పాటు ఈ ప్రాసెసర్ సమర్థవంతంగా ఉంటుంది. రాబోయే సాఫ్ట్‌వేర్ అప్‌డేట్‌లకు అనుకూలంగా ఉంటుంది. దీని వెనుక భాగంలో 48వీు ం 12వీు డ్యూయల్ కెమెరా సెటప్ ఉంది. సెల్ఫీలు, వీడియో కాల్స్ కోసం ముందు భాగంలో 12వీు కెమెరా ఉంది. బ్యాటరీ విషయానికి వస్తే ఈ ఐఫోన్ పూర్తి ఛార్జింగ్‌పై 22 గంటల వీడియో ప్లేబ్యాక్‌కు మద్దతు ఇస్తుంది. దీని తక్కువ ధర, గొప్ప ఫీచర్లు, సాఫ్ట్‌వేర్ సపోర్ట్ కారణంగా ప్రజలు ఈ ఐఫోన్‌ను ఇష్టపడుతున్నారు.

**ఐఫోన్ 16 పై తగ్గింపు ఎక్కడ లభిస్తుంది?**

భారతదేశంలో ఈ ఐఫోన్ ప్రారంభ ధర రూ. 79,900 కాగా, ఇప్పుడు ఇది చాలా చౌకగా మారింది. రూ. 16,000 డైరెక్ట్ డిస్కౌంట్ తర్వాత ఈ ఫోన్ ఫ్లిప్‌కార్ట్‌లో రూ. 63,900 కే లభిస్తోంది. మీరు ఈ ఐఫోన్‌ను కొనుగోలు చేస్తే ఇంత ధర చెల్లించాల్సిన అవసరం ఉండదు. రూ. 16,000 ఫ్లాట్ డిస్కౌంట్‌తో పాటు దీనిపై రూ. 4,000 బ్యాంక్ ఆఫర్‌ను కూడా పొందవచ్చు. మొత్తం రూ. 20,000 డిస్కౌంట్ తర్వాత, మీరు కేవలం రూ. 59,900 చెల్లించి ఈ ఐఫోన్‌ను కొనుగోలు చేయవచ్చు.

**గూగుల్ పిక్సెల్ 10ను చౌకగా కొనుగోలు చేసే అవకాశం**

మీరు ఆండ్రాయిడ్ ఫోన్‌పై డిస్కౌంట్ కోసం ఎదురు చూస్తున్నట్లయితే, అమెజాన్‌లో ఒక గొప్ప ఆఫర్ అందుబాటులో ఉంది. గత సంవత్సరం విడుదలైన గూగుల్ పిక్సెల్ 10ను అమెజాన్‌లో భారీ డిస్కౌంట్లతో కొనుగోలు చేయవచ్చు. ఈ ఫోన్ భారతదేశంలో రూ. 79,999 ధరకు విడుదలైంది. కానీ ఇప్పుడు అమెజాన్ అందిస్తున్న అన్ని ఆఫర్లను కలుపుకొని మీరు దీనిని రూ. 59,000 కంటే తక్కువ ధరకే కొనుగోలు చేయవచ్చు.

Printed , Published and Owned by POLAGONI ALIVELU, and Printed at Smilys Online, 6-7-48, Vanasthalipuram, Shopping Complex, Rangareddy-500070. Telangana State and Published from 17-10-25, Plot No.H.No. 4-136/12, Turkayamjal Journalist Colony, Rangareddy501510, Telangana State. Editor: POLAGONI ALIVELU. PRGI No. TGTEL/25/A3190. Phone No: +91 7989151815